ANN తెలుగు
Follow: @ANNTELUGU
13-09-2026
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 235 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## భక్తితో గణనాథుడిని పూజిద్దాం

- ప్రభుత్వపరంగా పూర్తి సహకారం
- గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**హైదరాబాద్, మహా :** గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### అసెంబ్లీ సమావేశాలు 16వరకు పొడిగింపు
22ఏపై మాట్లాడనున్న సీఎం

03



### కేసీఆర్.. మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే చట్టసభలపై నమ్మకం లేదా..?

- ప్రజాస్వామ్యాన్ని గులాబీ పార్టీ ఖూనీచేసింది
- ఫాంహౌస్‌ను సచివాలయంగా భావిస్తున్నారని మంత్రి సీతక్క ఫైర్

03



### ఆ భూములన్నీ నావని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- మంత్రి పొంగులేటికి పల్లా ఛాలెంజ్

02



ఏపీలో భారీ వర్షా ల బీభత్సం..

### ఉత్తరాంధ్రకు ముప్పు

- అల్పపీడనంతో ఉధృతమైన వానలు.
- అల్లూరిలో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయి 15 గ్రామాలకు రాకపోకలు బంద్.
- విజయవాడ జలమయం.. కోస్తా జిల్లాలకు వర్ష హెచ్చరికలు.
- గంటకు 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు

03



మోదీ దౌత్యానికి బ్రిక్స్ వేదికగా

# కొత్త బలం

## పుతిన్, జిన్‌పింగ్‌తో కలిసి నవ్విన ప్రధాని

- ఒకే ఫొటోతో ప్రపంచానికి బలమైన సందేశం
- భారత్, రష్యా, చైనా మధ్య సమన్వయంపై ఆసక్త.
- ఢిల్లీ బ్రిక్స్ సదస్సుపై ప్రపంచం చూపు
- వాణిజ్యం, కరెన్సీ, గ్లోబల్ సౌత్ అంశాలపై కీలక చర్చల.



### బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు

- అందరినీ కలుపుకుని ముందుకు సాగుతుంది.
- గ్లోబల్ సౌత్ 'రూల్ టేకర్' కాదు 'రూల్ షేపర్'గా మారాలి
- ప్రపంచ పాలనలో సంస్కరణలకు 10 సూత్రాల రోడ్‌మ్యాప్
- ఐరాస భద్రతా మండలి సంస్కరణలు ఇక ఆలస్యం వద్దు : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ, మహా:** ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయంగా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న ఈ సమావేశానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తోపాటు బ్రిక్స్ సభ్య దేశాల నేతలు హాజరయ్యారు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో భారత్, రష్యా, చైనా నేతలు ఒకే వేదికపై కనిపించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. సదస్సు తొలిరోజే ప్రధాని మోదీ, పుతిన్, షీ జిన్‌పింగ్ పరస్పరం చేతులు కలుపుతూ చిరునవ్వులు చిందించిన దృశ్యం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా మోదీ ఆ దృశ్యాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో విస్తృతంగా

మిగతా 2వ పేజీలో

## ఆదిలాబాద్ విమానాశ్రయానికి వేగంగా అడుగులు

### రాజ్‌నాథ్, రామ్మోహన్ నాయుడుతో కిషన్‌రెడ్డి కీలక భేటీ

వచ్చే వారంలో నోడల్ అధికారులు..

డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు వేగం



**న్యూఢిల్లీ,మహా**

వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఉత్తర తెలంగాణలో ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లో సంయుక్త వినియోగ విమానాశ్రయం ఏర్పాటు అంశంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో శనివారం సమావేశమై ప్రాజెక్టు పురోగతిని సమీక్షించినట్లు వెల్లడించారు.విమానాశ్రయ ప్రాజెక్టు అమలును మరింత వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు విషయంలో రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మూడు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత పకడ్బందీగా కొనసాగిస్తూ పనులను ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.ఆదిలాబాద్‌లో సంయుక్త వినియోగ విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణకు మెరుగైన విమాన కనెక్టివిటీతో పాటు వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా విమానాశ్రయం, వైమానిక దళ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రాంతీయ విమాన రాకపోకలను విస్తరించాల్సిన అవసరాన్ని కూడా వివరించినట్లు చెప్పారు.ఆదిలాబాద్‌లో సంయుక్త వినియోగ విమాన క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేసినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని రక్షణ మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం కొన్నేళ్లుగా

మిగతా 3వ పేజీలో



### తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

- కొండా సురేఖకు అధిష్ఠానం నుంచి పిలుపు

**వరంగల్,మహా ;** మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. ఢిల్లీకి వెంటనే రావాలని ఆమెకు అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం అందింది. మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖతో నిన్న (శుక్రవారం) తెలంగాణ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ స్వయంగా మాట్లాడారు. కొండా సురేఖకు కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తుంది. వరంగల్ జిల్లాలోని గీసుకొండలో కొండా సురేఖ

మిగతా3వ పేజీలో

### భారత్ చైనా కలిసి నడవాలి

02

ప్రధాని నరేంద్ర మోదీతో భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు

సరిహద్దు వివాదాలకు పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం





### 20న కొడంగల్‌లో పాంచజన్య సంకల్ప సభ

- రేవంత్‌పై కవిత తీవ్ర విమర్శలు..

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తెలంగాణ చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య జరిగిన పరిణామాలపై ఆమె స్పందించారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన అసెంబ్లీలో పరస్పర విమర్శలు, వాగ్వాదాలు చోటుచేసుకోవడం బాధాకరమని అన్నారు. మాజీ పార్లమెంటేరియన్‌గా, మాజీ ఎమ్మెల్సీగా అసెంబ్లీలో జరిగిన పరిణామాలు తనను బాధించాయని కవిత పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్షాలు కలిసి పనిచేస్తే ప్రజా సమస్యలు పరిష్కరించవచ్చని, కానీ ప్రస్తుతం ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తనను తాను గొప్పగా

మిగతా 2వ పేజీలో

### హైదరాబాద్ భవిష్యత్ పాలనకు కొత్త బాట

- బ్లూ, గ్రీన్ సిటీగా నగరం
- 30 ఏళ్ల అవసరాలే లక్ష్యం: మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. నగరాన్ని బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయడంతో పాటు రాబోయే 30 ఏళ్లలో పెరగనున్న జనాభా, రవాణా,

మిగతా 3వ పేజీలో

### కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు

- రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకూడదు
- శాసనసభలో ఎమ్మెల్యే రాజాసింగ్
- నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వాములు చేయాలని విన్నపం
- ముందుగా బస్తీలు, గల్లీల్లో ప్రాథమిక సమస్యలు తీరాలని సూచన



**హైదరాబాద్, మహా :** శాసనసభలో 'కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు' పై జరిగిన చర్చ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు

మిగతా 2వ పేజీలో

### ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి గుండు సున్నా

- రాష్ట్ర నిధులతోనే 4 లక్షల ఇళ్ల నిర్మాణం
- పేదల నివాస ప్రాంతాల్లోనే జి+3 ఇళ్లు
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02





## ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి గుండు సున్నా

**హైదరాబాద్, మహా:** ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందలేదని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి ఇళ్లు మంజూరు చేయాలని పలుమార్లు కేంద్రాన్ని కోరినా స్పందన లేదని అన్నారు. కేంద్రానికి లేఖలు రాయడంతో పాటు ఢిల్లీలో పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, కేంద్రం నుంచి "గుండు సున్నా" వచ్చిందని మండిపడ్డారు. శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ఒక్కో ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని పొంగులేటి తెలిపారు. నిర్మాణ వ్యయం భారం కాకుండా హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ సంస్థల నుంచి నిధులు సమీకరించే చర్యలు చేపట్టామని, హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణాన్ని తీసుకుని లబ్ధిదారుల ఖాతాల్లోకి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జమ చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తక్కువ ధరకే సిమెంట్ లభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఏవై-గ్రామీణ పథకం కింద తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని పలుమార్లు కోరినట్లు మంత్రి తెలిపారు. ఒక్కో ఇంటికి కేంద్రం నుంచి రూ.72 వేల సహాయం, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.27 వేలు, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా రూ.12 వేల వరకు కలిపి మొత్తం సుమారు రూ.1.11 లక్షల కేంద్ర వాటా అందే అవకాశం ఉందని చెప్పారు. అయినప్పటికీ రాష్ట్రానికి ఇళ్ల మంజూరులో కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాలకే కాకుండా పట్టణ ప్రాంతాల్లోనూ పీఎంఏవై-అర్బన్ కింద కేంద్ర సహకారం కోరామని పొంగులేటి తెలిపారు. పట్టణ పేదల గృహ నిర్మాణానికి కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి సుమారు రూ.1.50 లక్షల సహాయం అందాల్సి ఉన్నప్పటికీ తెలంగాణకు ఆ మేరకు నిధులు అందలేదని అన్నారు. కేంద్రం నుంచి ఇళ్ల మంజూరు, ఆర్థిక సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోందని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లపై కూడా మంత్రి విమర్శలు చేశారు. పేదలు నివసించే ప్రాంతాలకు దూరంగా, నగరాలకు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల లబ్ధిదారులు అక్కడ నివసించేందుకు ఆసక్తి చూపలేదని అన్నారు. ఉపాధి, విద్య, వైద్యం, రవాణా వంటి అవసరాలకు దూరంగా ఇళ్లు నిర్మించడం వల్ల అనేక ఇళ్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆ విధానాన్ని మార్చిందని పొంగులేటి తెలిపారు. పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లను నిర్మించేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. నగరాల్లో అందుబాటులో ఉన్న భూమిని సమర్థంగా వినియోగిస్తూ జి+3 నమూనాలో బహుళ అంతస్తుల గృహ సముదాయాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. పేదల జీవన పరిస్థితులు, వారి ఉపాధి ప్రాంతాలు, పిల్లల విద్య, రవాణా సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని గృహ నిర్మాణ ప్రాంతాలను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కూడా పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా 7,680 ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వివరించారు.



## విద్యార్థులు మాదకద్రవ్యాల కు దూరంగా ఉండాలి

- మడికొండ సీఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**కాజీపేట, మహా ;** వరంగల్ నగర పోలీస్ కమీషనర్ ఎన్ శ్వేత, ఐపిఎస్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళా బృందంచే శనివారం సాయంత్రం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడిపికొండ సూర్య కుటీర్ లోని శ్రీ చైతన్య సీబీఎస్సీ హై స్కూల్ లో మడికొండ సీఐ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చదువుకునే పిల్లలు గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, ఆడ పిల్లలు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని, మొదట చదువు పై దృష్టి సారించాలని , సైబర్ మోసాల బారిన పడవద్దని, రోడ్డు ప్రమాదాలు, డయల్ 112, షీ టీమ్స్ బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, భరోసా, గురించి వివరిస్తూ, తల్లితండ్రులు చెప్పిన మాట వినాలని, సైబర్ మోసాలకు గురైతే సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి ఫోన్ చేయాలని సూచించారు, ఈ సందర్భంగా పలు సామాజిక అంశాల పై పోలీస్ జాగృతి కళా బృందం వారు ఆలపించిన పాటలు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేసాయి.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు జె.రాజబాబు, పి రాజకుమార్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అధ్యాపక బృందం,కళా బృందం ఇంచార్జి ఉమెన్ ఏఎస్సై నాగమణి, తో పాటు హెడ్ కానిస్టేబుల్స్ విలియమ్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ రత్నయ్య , పూల్ సింగ్, హోమ్ గార్డ్స్, శ్రీనివాస్ , నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి, 150 మంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 4 రోజులైనా ఫిర్యాదు పై స్పందించని ఖాకీ

- బిఎస్పి నాయకున్ని చంపుతానంటూ బెదిరిస్తున్న పొగాకు రామకృష్ణ
- ఇంత జార్గంజ్ పోలీస్ స్టేషన్ లో బాధితుని ఫిర్యాదు

**వరంగల్, క్రైమ్ మహా ;** ఇటీవల కాలంలో రాజకీయ నాయకుల అండదండలతో నేరస్తులు చట్టం పై పూర్తి అవగాహన లేకుండా వివిధ నేరాలకు పాల్పడు తున్నారనే విమర్శలు లేకపోలేదు. సమాజంలో ఒకప్పుడు పోలీసులు అంటే భయపడే నేరస్తులు ఇప్పుడు నేరం చేసి వారికే సవాల్ విసిరే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఎందుకంటే రౌడీ షీటర్లకు, నేరాలు చేయాలనుకునే వారి విషయంలో రాజకీయ జోక్యం మితిమీరి పోయింది. నేరం చేస్తే అధికార పార్టీ అండ లేదా డబ్బు పారేస్తే ఏ నేరానికైనా శిక్ష నుండి సులభంగా తప్పించుకోవచ్చు అనే ఊహల్లో కొంతమంది ఉన్నారని ఇటీవల కాలంలో జరిగిన నేరాలను గమనిస్తే అర్థమవుతోంది. రాజకీయ కక్షలో భాగంగా ఇటీవల జరిగిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అడుప మహేష్ హత్యనే ఓ ఉదాహరణ. అది మరవకముందే బీఎస్పి పార్టీ వరంగల్ నియోజకవర్గ ఇన్చార్జి జన్ను అనిల్ కుమార్ ను పెట్రోల్ పోసి హత్య చేస్తానని పొగాకు రామకృష్ణ పరోక్షంగా బెదిరిస్తున్నారని ఈనెల 8వ తేదీన వరంగల్ ఇంత జార్గంజ్ పోలీస్ స్టేషన్ లో జన్ను అనిల్ కుమార్ ఫిర్యాదు చేశాడు.

**వివరాల్లోకెళ్తే..**

వరంగల్ తూర్పు నియోజకవర్గం 12 డివిజన్ లోని దేశాయిపేట 326 సర్వే నెంబర్ లో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని రాజకీయ పలుకుబడి ఉన్న పొగాకు రామకృష్ణ అనే వ్యక్తి కబ్జా చేసాడని దాని పై బీఎస్పి పార్టీ తరపున జన్ను అనిల్ కుమార్ వరంగల్ జిల్లా కలెక్టర్ తో పాటు మున్సిపల్ కమిషనర్ కు కూడా గతంలో ఫిర్యాదులు చేశానని అందుకు పొగాకు రామకృష్ణ కక్ష కట్టి నన్ను కూడా ఆడప మహేష్‌ను పెట్రోల్ పోసి చూపినట్లుగా నన్ను కూడా చంపుతానని బెదిరిస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. దీనిపై ఈనెల 8వ తారీకు ఇంత జార్గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని జన్ను అనిల్ తెలిపారు. ఇంతవరకు ఫిర్యాదు పై పోలీసులు ఎటువంటి విచారణ చేపట్టలేదని శుక్రవారం ఎస్ఐ సందీప్ ను సంప్రదించగా శనివారం ఉదయం దర్యాప్తుకు వస్తానని చెప్పారు. కానీ పోలీసుల నుండి ఇంతవరకు ఎటువంటి స్పందన లేదని బాధితుడు అనిల్ తెలిపాడు. నాకు ఏదైనా ప్రాణ హాని జరిగితే పూర్తి బాధ్యత పొగాకు రామకృష్ణ దే అని ఇలాంటి కబ్జా చేస్తున్న కబ్జా దారులకు కొంతమంది అధికార పార్టీ రాజకీయ నాయకులు అండగా నిలుస్తున్నారని ఆరోపించాడు.ఇలాంటి వారి పై ఫిర్యాదులు వస్తే పోలీసుల నుండి స్పందనే కరువైందని పోలీస్ అధికారులు కూడా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు. ఇప్పటికైనా ఇలాంటి వారి పై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ కు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు విషయ మై నాలుగు రోజుల గడుస్తున్న ఎటువంటి దర్యాప్తు చేపట్ట లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి పొగాకు రామకృష్ణ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలనిఅనిల్ కుమార్ కోరారు.




## భక్తితో గణనాథుడిని పూజిద్దాం

- ప్రభుత్వపరంగా పూర్తి సహకారం
- గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



**హైదరాబాద్, మహా :** గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**దేశంలో ఎక్కడాలేని విధంగా మండపాలకు ఉచిత విద్యుత్**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్‌కు అందించాలని సూచించారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

**మండపాల సమాచారం ముందుగానే ఇవ్వాలి**

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ హాజరయ్యారు.

## ఆ భూములన్నీ నావని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

**మంత్రి పొంగులేటికి పల్లా ఛాలెంజ్**



**హైదరాబాద్, మహా :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర అహంకారంతో వ్యవహరిస్తూ, బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్ రావు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో పల్లా మాట్లాడారు. జనగామలో హరీష్ రావుతో కలిసి రెవెన్యూ శాఖలోని అక్రమాలను తాము బయటపెట్టినందుకే కక్ష సాధింపు చర్యలలో భాగంగానే తమపై, బీఆర్ఎస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వట్టినాగులపల్లిలోని సర్వే నంబర్ 188లో రూ.3 వేల కోట్ల విలువైన 29 ఎకరాల భూదాన్ భూమిని తాను ఆక్రమించానని పొంగులేటి చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని పల్లా కొట్టిపారేశారు. ఆ 29 ఎకరాల భూమి తనదేనని నిరూపిస్తే నిమిషంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఒకవేళ నిరూపించలేకపోతే పొంగులేటి తన మంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారా అని నిలదీశారు. రూ.3 వేల కోట్ల విలువైన భూమి అని చెబుతున్న పొంగులేటి, రూ.10 కోట్లో లేదా రూ.50 కోట్లో ఇచ్చి ఆ భూమిని తీసుకోవడానికి సిద్ధమైతే ఏ కాగితంపై అయినా సంతకం పెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. వట్టినాగులపల్లిలో తనకు ఉన్నది కేవలం ఎకరం 10 గుంటల భూమి మాత్రమేనని పల్లా వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే ఆ భూమికి సంబంధించి ఒప్పందం చేసుకుని, జూన్ 2014లో చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఆ భూమి భూదాన్ పరిధిలోకి రాదని 2008లోనే భూదాన్ యజ్ఞ బోర్డు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిందని, సంబంధిత కోర్టు కూడా స్పష్టతనిచ్చి అధికారులను మార్పులు చేయాలని ఆదేశించిందని గుర్తుచేశారు.

**పొంగులేటి బినామీలు నా వద్దకు వచ్చారు**

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బినామీలు నా వద్దకు వచ్చి ఆ ఎకరం 10 గుంటల భూమిని విక్రయించాలని ఒత్తిడి తెచ్చారని, తాను అమ్మడానికి నిరాకరించడంతోనే కక్ష కట్టారని పల్లా ఆరోపించారు. కేవలం 10 నుంచి 15 రోజుల వ్యవధిలోనే తన భూమితో పాటు ఇతర భూములను 22ఏ (నిషేధిత) జాబితాలో చేర్చి బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ అంశంపై తాము కోర్టును ఆశ్రయించగా, ఆ భూమిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశించవద్దని కోర్టు అధికారులను ఆదేశించిందని చెప్పారు. కేసీఆర్, హరీష్ రావులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు పొంగులేటి తక్షణమే క్షమాపణలు చెప్పాలని, లేకపోతే తెలంగాణ ప్రజలే ఆయన అహంకారానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## విజయ డెయిరీని బలోపేతం చేస్తాం

**హైదరాబాద్, మహా:** విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభి ృద్ధి, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో విజయ డెయిరీ పాల సేకరణకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ సంస్థ బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.విజయ డెయిరీలో పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందని మంత్రి తెలిపారు. దీర్ఘకాలంగా కొనసాగిన లీన్ సీజన్ ప్రభావంతోనే పాల సేకరణలో ఈ తగ్గుదల కనిపించిందని వివరించారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల సగటు రోజువారీ పాల సేకరణను పరిశీలిస్తే 2023-24లో 3.60 లక్షల లీటర్లు, 2024-25లో 4 లక్షల లీటర్లు, 2025-26లో 3.36 లక్షల లీటర్లుగా నమోదైనట్లు వెల్లడించారు. పాల సేకరణలో తాత్కాలిక ఒడుదొడుకులు ఉన్నప్పటికీ పాడి రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పాల సేకరణ బకాయిలు ఏవీ లేవని తేల్చిచెప్పారు. రైతుల నుంచి సేకరించిన పాలకు సంబంధించి చెల్లింపులు పెండింగ్‌లో లేవని తెలిపారు. తెలంగాణలోని పాడి రైతులకు దేశంలోనే అత్యధిక ధర చెల్లిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.విజయ డెయిరీని ఆధునికీకరించడంతో పాటు పాల ఉత్పత్తుల మార్కెటింగ్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించడం, సంస్థ ఆదాయాన్ని పెంచడం, మార్కెట్‌లో విజయ డెయిరీ ఉత్పత్తులకు మరింత ఆదరణ కల్పించడం వంటి చర్యలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ృత్రిమ పన్నీరు తయారీ, విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందని మంత్రి తెలిపారు. విజయ డెయిరీ ద్వారా కేవలం పాలతో తయారు చేసిన పన్నీరు మాత్రమే విక్రయిస్తున్నామని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా వినియోగదారులకు స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.విజయ డెయిరీకి అదనపు ఆదాయ వనరులను సమకూర్చే దిశగా కూడా చర్యలు చేపడుతున్నామని వాకిటి శ్రీహరి తెలిపారు. సంస్థకు చెందిన అనుకూలమైన స్థలాల్లో పెట్రోలు బంకులు, షాపింగ్ సముదాయాలు ఏర్పాటు చేసి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడానికి ఇటువంటి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు ఉపయోగపడతాయని చెప్పారు.పశు వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. పశువైద్యశాఖలో 110 మంది వైద్యులు, 304 మంది సహాయక సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు.

### మోదీ దౌత్యానికి బ్రిక్స్ వేదికగా

## కొత్త బలం

( మొదటి పేజీ తరువాయి )

చర్చకు వచ్చింది. భారత్, రష్యా, చైనా మధ్య ఉన్న సంబంధాలను ఒకే ఫొటో ప్రతిబింబిస్తోందంటూ పలువురు నెటిజన్లు స్పందించారు. ముఖ్యంగా మూడు దేశాల మధ్య వ్యూహాత్మక సమన్వయం అంతర్జాతీయ రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపనుందన్న చర్చకు ఈ దృశ్యం మరింత ఊతమిచ్చింది. బ్రిక్స్ విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ సదస్సుకు అంతర్జాతీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచ నిర్ణయాల రూపకల్పనలో మరింత ప్రాతినిధ్యం కల్పించడం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సమాన అవకాశాలు కల్పించడం, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం వంటి అంశాలు ప్రధాన చర్చలుగా నిలిచాయి. గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తమ వాటాకు అనుగుణంగా నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలన్న డిమాండ్ కూడా సదస్సులో ప్రాధాన్యం సంతరించుకుంది.అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యం, సభ్య దేశాల మధ్య స్థానిక కరెన్సీల వినియోగం, చెల్లింపుల వ్యవస్థలను మరింత సులభతరం చేయడం వంటి అంశాలు కూడా బ్రిక్స్ చర్చల్లో కీలకంగా మారాయి. అయితే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఒకే కరెన్సీని బ్రిక్స్ ఏర్పాటు చేస్తోందన్న ప్రచారానికి భిన్నంగా, ప్రస్తుతం ప్రధానంగా స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను బలోపేతం చేయడంపైనే చర్చలు సాగుతున్నాయి. ఎగుమతులు, దిగుమతుల విషయంలో సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంచడం, వాణిజ్య అడ్డంకులను తగ్గించడం, పెట్టుబడులకు మరిన్ని అవకాశాలు కల్పించడం వంటి అంశాలపైనా చర్చలు జరుగుతున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో బ్రిక్స్ ఆర్థిక సహకారానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది.భారత్-చైనా సంబంధాల్లో ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న పరిణామాలు, భారత్-రష్యా సంప్రదాయ మైత్రి, పాశ్చాత్య దేశాలతో భారత్ కొనసాగిస్తున్న సంబంధాలు కూడా ఈ సదస్సు నేపథ్యంలో అంతర్జాతీయ విశ్లేషణకు కారణమయ్యాయి. అయితే భారత్ తన విదేశాంగ విధానంలో ఏ ఒక్క కూటమికీ పరిమితం కాకుండా.. జాతీయ ప్రయోజనాల ఆధారంగా అన్ని ప్రధాన శక్తులతో సంబంధాలను కొనసాగిస్తోంది. అదే సమయంలో బ్రిక్స్‌ను ఏ దేశానికీ వ్యతిరేకమైన వేదికగా కాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాల సహకార వేదికగా భారత్ అభివర్ణిస్తోంది. మోదీ నాయకత్వంలో ఢిల్లీలో జరుగుతున్న సదస్సుపై అమెరికా, ఐరోపా దేశాల మీడియా కూడా విస్తృతంగా దృష్టిసారించింది. బ్రిక్స్ విస్తరణ, భారత్-రష్యా-చైనా సంబంధాలు, ప్రపంచ వాణిజ్యంలో మారుతున్న సమీకరణాలు, గ్లోబల్ సౌత్ ప్రాధాన్యం వంటి అంశాలపై అంతర్జాతీయంగా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా బ్రిక్స్ దేశాల ఆర్థిక బలం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ప్రపంచ వ్యవస్థపై ఈ వేదిక ప్రభావం ఎంతవరకు ఉంటుందన్నది పరిశీలకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.ఇదే సమయంలో ప్రధాని మోదీ "బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు.. అందరినీ కలుపుకుని ముందుకు సాగుతుంది" అన్న సందేశం ఇవ్వడం ద్వారా భారత వైఖరిని స్పష్టం చేశారు. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య సహకారం, పరస్పర గౌరవం, సమాన ప్రాతినిధ్యమే తమ లక్ష్యమని భారత్ చెబుతోంది.రెండో రోజు సమావేశాల్లో ప్రపంచ పాలనలో సంస్కరణలు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు మరింత ప్రాతినిధ్యం, సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్యం, ఇంధన భద్రత, అంతర్జాతీయ శాంతి వంటి అంశాలపై మరిన్ని చర్చలు జరిగే అవకాశం ఉంది. భారత్ వేదికగా బ్రిక్స్ దేశాలు ప్రపంచ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో తమ పాత్రను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో.. ఢిల్లీ సదస్సు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది.

## 20న కొడంగల్‌లో పాంచజన్య సంకల్ప సభ

(మొదటి పేజీ తరువాయి )

చూపించుకునే ప్రయత్నం చేశారని కవిత ఆరోపించారు. తనపై ఉన్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు, తన ఇమేజ్ పెంచుకునేందుకు అసెంబ్లీని ఉపయోగించుకున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో అవినీతి జరుగుతోందని ఆరోపించిన ఆమె.. ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలపై ప్రశ్నలు లేవనెత్తారు. రేవంత్ చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేదని వ్యాఖ్యానించారు.

**సిద్దిపేట భూములపై ఆధారాలు ఇస్తా**

సిద్దిపేటలో భూముల వ్యవహారంపై కవిత కీలక ఆరోపణలు చేశారు. ప్రొహిబిటెడ్ జాబితాలో ఉన్న భూములను తొలగించి రిజిస్ట్రేషన్లు చేశారన్న ఆరోపణలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను అందిస్తానని, నిజాలు బయటకు రావాలని ఆమె అన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరపాలని కోరారు.

**ఈ నెల 20న కొడంగల్‌లో సభ..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో ఈ నెల 20న పాంచజన్య సంకల్ప సభ నిర్వహించనున్నట్లు కవిత తెలిపారు. ఈ సభ ద్వారా ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అంశాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని చెప్పారు. ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి ఉండాలని, రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం కాకూడదని ఆమె సూచించారు.

## భారత్ చైనా కలిసి నడవాలి

**ఢిల్లీ, మహా :** భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ ముగిసింది. బ్రిక్స్ సదస్సు వేదికగా ఇరు దేశాల అగ్రనేతలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా సరిహద్దు ఒప్పందాలు, వాణిజ్యం, పర్యాటకం, వ్యాపారం, సాంస్కృతిక బదిలీ వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా సరిహద్దు ఒప్పందాలను ఇరు దేశాలు తప్పనిసరిగా గౌరవించాలని భారత ప్రధాని మోదీ అన్నారు. సరిహద్దుల్లో శాంతి, భద్రతలే ద్వైపాక్షిక సంబంధాలకు పునాది అని ఆయన స్పష్టం చేశారు. సరిహద్దు వివాదాలకు న్యాయబద్ధమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రెండు దేశాలూ కట్టుబడి ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనాలే మార్గదర్శకంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చైనా, భారత్ మధ్య విభేదాలు వివాదాలుగా మారకూడదని జిన్‌పింగ్, మోదీ పేర్కొన్నారు. అనంతరం రెండు దేశాల మధ్య భారీ వాణిజ్య లోటు, సరఫరా సమస్యలపై ప్రధానంగా చర్చించారు. ఈ మేరకు భారత ఉత్పత్తులకు చైనా మార్కెట్లలో సరైన ప్రవేశం కల్పించాలని మోదీ కోరారు. దీంతో వ్యాపారం, పర్యాటకం, సాంస్కృతిక బదిలీలకు ఊతమివ్వాలని ద్వైపాక్షిక భేటీలో నిర్ణయించారు. కాగా, బ్రిక్స్ సదస్సు విజయవంతానికి సహకరించిన చైనాకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు.

## కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు

( మొదటి పేజీ తరువాయి )

ప్రాధాన్యత ఇవ్వడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఆయన శాసనసభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లేదా ప్రజా సమస్యలపై సూచనలు చేసినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది నిధులు మంజూరు చేయడం ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ... ఆ నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలకు తగిన భాగస్వామ్యం కల్పించాలని కోరారు.గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ కూడా హైదరాబాద్‌ను గొప్పగా అభివృద్ధి చేయాలని భావించినప్పటికీ హైదరాబాద్ ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశాలు పెట్టాలని తాను ఇచ్చిన సూచనలను ఆయన పట్టించుకోలేదని రాజాసింగ్ గుర్తుచేశారు. ఇప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకుండా, నగర పరిధిలోని ఎమ్మెల్యేలందరితో కలిసి ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయికి చేరాలంటే ముందుగా బస్తీలు, గల్లీలలో ఉన్న ప్రాథమిక సమస్యలు తీరాలని రాజాసింగ్ పేర్కొన్నారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల మధ్య తీవ్ర అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని... మంచినీటి సరఫరా ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు మురికి నీరే వస్తోందని సభ దృష్టికి తెచ్చారు. కొన్ని ప్రాంతాలలో అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున 3, 4 గంటలకు నీరు విడుదల చేస్తుండటంతో ప్రజలు నిద్రలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తగినంత రవాణా, డ్రైనేజీ సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించకుండానే బహుళ అంతస్తుల (హైరైజ్) భవనాలకు అనుమతులు ఇవ్వడం వల్ల సమస్య మరింత సంక్లిష్టంగా మారుతోందని విమర్శించారు.

# ఏపీలో భారీ వర్షాల బీభత్సం.. ఉత్తరాంధ్రకు ముప్పు

- **అల్పపీడనంతో ఉధృతమైన వానలు.**
- **అల్లూరిలో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయి 15 గ్రామాలకు రాకపోకలు బంద్.**
- **విజయవాడ జలమయం.. కోస్తా జిల్లాలకు వర్ష హెచ్చరికలు.**
- **గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు**



**అమరావతి, మహా :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు మరింత ఉధృతమయ్యాయి. గత రెండు రోజులుగా ఉత్తరాంధ్రతో పాటు కోస్తా జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాల ప్రభావం తీవ్రంగా కనిపించింది. జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ చిన్న గంగవరం వద్ద తాత్కాలిక వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దులోని 15 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

**అల్లూరిలో వంతెన కొట్టుకుపోయి 15 గ్రామాలు అష్టకష్టాలు**

చిన్న గంగవరం వద్ద ఉన్న తాత్కాలిక వంతెనపైనే సరిహద్దు ప్రాంతంలోని పలు గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేవారు. 2024లోనూ ఇదే వంతెన దెబ్బతినడంతో తాత్కాలికంగా పునరుద్ధరించారు. ఇప్పుడు మరోసారి భారీ వర్షాలు, వరద ప్రవాహానికి వంతెన కొట్టుకుపోవడంతో గ్రామాలకు రవాణా మార్గం తెగిపోయింది. నిత్యావసర సరుకులు, వైద్య సేవలు, అత్యవసర రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో తాత్కాలిక ఏర్పాట్లకు బదులుగా శాశ్వత వంతెన నిర్మించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ, వర్షపాతం గణాంకాలు కూడా సూచిస్తున్నాయి. ఉత్తరాంధ్రలోని అల్లూరి, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో శుక్రవారం నుంచే వర్ష కార్యకలాపాలు పెరిగాయి. పలుచోట్ల భారీ వర్షపాతం నమోదైంది.

**విజయవాడలో రహదారులు జలమయం**

అల్పపీడనం ప్రభావం విజయవాడపైనా స్పష్టంగా కనిపించింది. శనివారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు నీటమునిగాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయానికి వర్షం కురవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. విజయవాడలోని పలు ప్రాంతాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైనట్లు వర్షపాతం గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోనూ వర్షాలు నమోదయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సగటు వర్షపాతం గణనీయంగా నమోదైనట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి. పశ్చిమగోదావరిలోని పెనుగొండ, ఇరగవరం, పెనుమంట్ర, ఆచంట, గణపవరం ప్రాంతాల్లో 90 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

**గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు**

వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్ర తీరంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో, దక్షిణ కోస్తా ప్రాంతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ అధికారులు తెలిపారు. గత హెచ్చరికల్లో తీర ప్రాంతాల్లో గాలుల వేగం 70 కిలోమీటర్ల వరకు చేరే అవకాశం ఉందని కూడా అధికారులు సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు స్పష్టం చేశారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, హోర్డింగులు, బలహీనమైన నిర్మాణాల వద్ద నిలబడకూడదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

**ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి**

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యాయి. పాలకొండ, బలిజిపేట ప్రాంతాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.

దక్షిణ కోస్తాలోనూ వర్షాలు కొనసాగుతున్నప్పటికీ ఉత్తరాంధ్రతో పోలిస్తే వర్ష తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉంది. అయినప్పటికీ కృష్ణా, గుంటూరు, పల్నాడు, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**తక్షణ వర్ష సూచనలు.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక.**

అల్పపీడన ప్రభావంతో శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కోనసీమ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో బలమైన గాలులతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ఏర్పడిన వాతావరణ వ్యవస్థ ఏపీకి ఒకవైపు వర్ష లోటును కొంత భర్తీ చేసే అవకాశం కల్పిస్తున్నప్పటికీ, అత్యధిక వర్షాలు కురిసే ప్రాంతాల్లో వరదలు, రహదారులపై నీటి నిల్వ, వంతెనలు, కల్వర్టులు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే అల్లూరిలో తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా మారింది.

**ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలి.**

వరద ప్రవాహం ఉన్న వాగులు, వంకలు, కల్వర్టులు, తాత్కాలిక వంతెనలను దాటేందుకు ప్రయత్నించవద్దని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రాకపోవడం మంచిదని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని, భారీ వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగుల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు.

### బంగాళాఖాతంలో అల్పపీడనం.. మరింత వర్ష సూచన

ప్రస్తుతం వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాన్ని ఆనుకుని అల్పపీడన వ్యవస్థ కొనసాగుతోంది. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. సంబంధిత ఆవర్తనం సముద్ర మట్టానికి సుమారు 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్నట్లు వాతావరణ నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ వ్యవస్థ ప్రభావంతో ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా వర్ష కార్యకలాపాలు కొనసాగవచ్చని అంచనా. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయానికి వేగంగా అడుగులు

( మొదటి పేజీ తరువాయి )

కొనసాగుతున్న ప్రయత్నాలు, వరుస సమావేశాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య లేఖలు, నిరంతర సమన్వయం ఇప్పుడు కీలక దశకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా ఈ పరిణామం ముఖ్యమైన ముందడుగని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో పాటు వాణిజ్యం, పరిశ్రమలు, పెట్టుబడులు, పర్యాటకం వంటి రంగాలకు మరింత ఊతం లభించే అవకాశం ఉందన్నారు.ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల ఉన్నతాధికారులు, తెలంగాణ ప్రభుత్వ అధికారుల మధ్య ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు జరిగినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గత ఏప్రిల్ 17న రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులు ఆదిలాబాద్‌లోని ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాన్ని



పరిశీలించినట్లు చెప్పారు. విమానాశ్రయ అవసరాలకు సుమారు 2.75 కిలోమీటర్ల పొడవైన రన్‌వే అవసరమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు వెల్లడించారు.

ప్రస్తుతం భారత వైమానిక దళం ఆధీనంలో ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సమీకరించాల్సి ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత విస్తీర్ణంలో శిక్షణ విమానాల కోసం అవసరమైన సదుపాయాలు, సందర్శక విమానాల పార్కింగ్, వాతావరణ రక్షణ షెల్టర్లు, విమానాల నిర్వహణకు హ్యాంగర్లు, కార్యకలాపాల సముదాయం, శిక్షణ కేంద్రాలు, నిర్వహణ మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పౌర విమానయానానికి సంబంధించిన మౌలిక వసతుల్లో భాగంగా పౌర టెర్మినల్‌తో పాటు నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాల కేంద్రాన్ని భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు కిషన్‌రెడ్డి వివరించారు. విమానాశ్రయంలో విధులు నిర్వహించే వైమానిక దళ సిబ్బందికి అవసరమైన నివాస వసతులు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటు కేవలం విమాన రాకపోకలకే పరిమితం కాకుండా ఉత్తర తెలంగాణ ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేసే ప్రాజెక్టుగా మారనుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర రక్షణ, పౌర విమానయాన శాఖలు, తెలంగాణ ప్రభుత్వం సమన్వయంతో మిగిలిన ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి ప్రాజెక్టును తదుపరి దశకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# హైదరాబాద్ భవిష్యత్ పాలనకు కొత్త బాట

( మొదటి పేజీ తవరువాయి )

మౌలిక వసతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాలనా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం అత్యంత కీలకమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రవాణా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్‌ను రూపొందించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిన నేపథ్యంలో వాటితోపాటు ఇతర కీలక సంస్థలు సమన్వయంతో పనిచేసేలా క్యూర్ చట్టం ద్వారా చట్టబద్ధ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.క్యూర్ అత్యున్నత పాలకమండలికి ముఖ్యమంత్రి అధ్యక్షత వహిస్తారని మంత్రి తెలిపారు. మహానగర పాలనకు సంబంధించిన చట్టాల్లో అవసరమైన సరళీకరణ చేపడతామని, భవిష్యత్ నగర పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు తొలిదశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్‌కు తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణ వంటి అవసరాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ 2047 విధానంతో రాష్ట్రాన్ని దీర్ఘకాలిక అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని మంత్రి తెలిపారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలని, భారీ పెట్టుబడులను ఆకర్షించే గ్లోబల్ సిటీగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. నగర చారిత్రక వైభవాన్ని కాపాడుతూనే ఆధునిక మౌలిక వసతులతో భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయనున్నట్లు స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా.. తెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. సాంకేతిక స్వభావం కలిగిన సుమారు 400 రకాల చిన్నపాటి ఉల్లంఘనలను నేరపూరిత పరిధి నుంచి తొలగించే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు మంత్రి తెలిపారు. దీని ద్వారా వ్యాపార నిర్వహణ మరింత సులభతరం అవుతుందని చెప్పారు. చిన్న వ్యాపారులు అనవసరంగా కేసులు, చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని తగ్గించడమే ఈ మార్పుల ఉద్దేశమని మంత్రి వివరించారు. కొత్త నిబంధనలపై కలెక్టర్లు, వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

# దసరా నుంచే కొత్త చేయూత పింఛన్లు

**హైదరాబాద్, మహా:** చేయూత పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. కొత్తగా అర్హత పొందే సుమారు రెండున్నర లక్షల మందికి దసరా నుంచే చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 42 లక్షల మంది చేయూత పింఛన్లు పొందుతున్నారు. తాజాగా అర్హత కలిగిన వారిని కొత్తగా పింఛన్ జాబితాలో చేర్చేందుకు దరఖాస్తుల స్వీకరణతోపాటు క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోంది.

కొత్త పింఛన్ల కోసం ఆగస్టు 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. తొలుత ఆగస్టు 31 వరకు గడువు విధించగా.. అర్హులైన వారందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో దానిని సెప్టెంబరు 15 వరకు పొడిగించారు. ఇప్పటికే అందిన దరఖాస్తుల పరిశీలన సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమైంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలు, వారి అర్హతలను పరిశీలిస్తున్నారు.కొత్త పింఛన్ల ఎంపికలో ఆర్థికంగా, సామాజికంగా అండ అవసరమైన వర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుంది. ముఖ్యంగా ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ పొందుతున్న వారు, థలసీమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులను అర్హత మేరకు పరిగణనలోకి తీసుకోనున్నారు. దరఖాస్తుదారుల వాస్తవ పరిస్థితులను ఇంటింటి పరిశీలనలో నిర్ధారించిన అనంతరం అర్హులైన వారి తుది జాబితాను సిద్ధం చేయనున్నారు.దరఖాస్తు సమయంలో అన్ని ధ్రువపత్రాలు అందుబాటులో లేకపోయినా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఆధారంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో తహసీల్దారు ధ్రువపత్రం, సదరెం లేదా ప్రత్యేక గుర్తింపు కార్డు, చేనేత శాఖ సహాయ సంచాలకుడి ధ్రువపత్రం, గీత కార్మికులకు సంబంధించిన ఎక్సైజ్ అధికారుల ధ్రువపత్రాలను సమర్పించవచ్చు. ఒంటరి మహిళలకు సంబంధించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి లేదా మున్సిపల్ కమిషనర్ ధ్రువపత్రం జారీ చేసే అవకాశం ఉంది.గ్రామీణ ప్రాంతాల్లో చేయూత పింఛన్ కోసం పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, మీ సేవా కేంద్రాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల ద్వారా దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోనూ చేయూత పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.దరఖాస్తుల స్వీకరణ గడువు పూర్తయిన తర్వాత క్షేత్రస్థాయి పరిశీలనను వేగంగా పూర్తి చేసి అర్హులైన వారి జాబితాను అక్టోబరు మొదటి వారంలో ఖరారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం దసరా పండుగ నుంచే కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల పంపిణీ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వివిధ వృత్తులకు చెందిన కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థికంగా కొంత ఊరట లభించనుంది.

# బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు



**న్యూఢిల్లీ, మహా:** బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకమైన కూటమి కాదని, ప్రపంచంలోని అన్ని దేశాలను కలుపుకుని ముందుకు సాగే వేదిక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా అంతర్జాతీయ పాలనా వ్యవస్థలో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు సంక్షోభాల ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నప్పటికీ.. ప్రపంచ నిర్ణయాల రూపకల్పనలో మాత్రం వాటి పాత్ర పరిమితంగానే ఉందని అన్నారు. ఈ పరిస్థితిని మార్చి అభివృద్ధి చెందుతున్న దేశాలను 'రూల్ టేకర్స్' నుంచి 'రూల్ షేపర్స్'గా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో సభ్య దేశాల నేతలు, ఆహ్వానిత దేశాల ప్రతినిధుల సమక్షంలో మోదీ ప్రసంగించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోపాటు ఇరాన్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, మలేసియా, యూఏఈ, ఈజిప్టు, ఇథియోపియా, వియత్నాం దేశాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బ్రిక్స్ రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మోదీ ఈ వేదిక ప్రస్థానాన్ని ప్రస్తావించారు. "మనిషి జీవితంలో 20 ఏళ్లు పరిపక్వతకు నాంది పలికే దశ. బ్రిక్స్ కూడా 20 ఏళ్లలో ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించింది" అని అన్నారు. పరస్పర గౌరవం, ఏకాభిప్రాయం, సహకార స్ఫూర్తితో బ్రిక్స్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రపంచ పాలనా వ్యవస్థలో సమూల మార్పుల కోసం పది సూత్రాలతో కూడిన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని మోదీ ప్రతిపాదించారు. ప్రపంచ వ్యవస్థను మరింత సమర్థంగా, బాధ్యతాయుతంగా, సమాన ప్రాతినిధ్యంతో తీర్చిదిద్దేందుకు ప్రాతినిధ్యం, స్పందనాత్మకత, నియమాల రూపకల్పన అనే మూడు ప్రధాన స్తంభాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇకపై ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచ ఆర్థిక, రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ స్థానాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల వాటాను పెంచాలని సూచించారు. కృత్రిమ మేధ, సైబర్ అంతరిక్షం, అంతరిక్ష పరిశోధనలు, జీవ సాంకేతిక రంగాల్లో భవిష్యత్ నియమాలు రూపొందించే సమయంలో గ్లోబల్ సౌత్ దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని ప్రధాని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కొద్దిమంది దేశాల ఆధిపత్యానికి పరిమితం కాకుండా.. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగపడేలా విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బ్రిక్స్‌లో అధ్యక్ష బాధ్యతలు మారినప్పటికీ గత నిర్ణయాలు, కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని మోదీ సూచించారు. దీనికోసం ట్రోయికా విధానాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఒకే చోట అందుబాటులో ఉంచే డిజిటల్ భాండాగారాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తద్వారా ప్రతి కొత్త అధ్యక్ష దేశం గత నిర్ణయాల నుంచి కొనసాగింపు సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. సముద్ర రవాణా రంగంలోని సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు సముద్ర సిబ్బంది అత్యవసర సహాయ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కూడా మోదీ ముందుకు తెచ్చారు. సముద్ర మార్గాలపై ఆధారపడే ప్రపంచ వాణిజ్యంలో నావికుల భద్రత, అత్యవసర సహాయం కూడా అంతర్జాతీయ సహకారంలో భాగం కావాలని ఆయన సూచించారు. ఇదే సమయంలో బ్రిక్స్ వేదికపై ఆమోదం పొందిన న్యూఢిల్లీ సంయుక్త ప్రకటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఇరాన్, యూఏఈ మధ్య కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. భారత్ చర్చలు, సంప్రదింపుల ద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కృషి చేసినట్లు సమాచారం. చివరకు సభ్య దేశాల మధ్య సమ్మతి సాధించి సంయుక్త ప్రకటనకు ఆమోదం లభించడం భారత అధ్యక్షతకు కీలక విజయంగా భావిస్తున్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇకపై ఇతరులు రూపొందించిన నియమాలను మాత్రమే అనుసరించే స్థితిలో ఉండకూడదని మోదీ స్పష్టం చేశారు. ప్రపంచ నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి గ్లోబల్ సౌత్ ఎదగాలి.. అంతర్జాతీయ వ్యవస్థలో తమ స్వరాన్ని మాత్రమే వినిపించడం కాకుండా నియమాల రూపకల్పనలోనూ భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు.ప్రపంచంలో విభేదాలు, ఘర్షణలు, ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ మరింత బాధ్యతాయుతమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. "బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు.. అందరినీ కలుపుకుని ముందుకు సాగుతుంది" అన్న సందేశంతో భారత దౌత్య విధానాన్ని మరోసారి స్పష్టం చేశారు.

## తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

( మొదటి పేజీ తరువాయి )

జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మిత పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు పరకాల అసెంబ్లీ స్థానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యల పై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖను వివరణ కోరింది. ఈ సందర్భంగా కమిటీకి ఆమె రెండు లేఖలు రాశారు.ఈ వ్యవహారం పై క్రమశిక్షణ కమిటీ.. పీసీసీ చీఫ్‌కు నివేదిక అందించింది. ఈ నివేదికను పార్టీ అధిష్ఠానానికి తెలంగాణ పీసీసీ చీఫ్ అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను మంత్రి పదవి నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేశారు. అయితే తాను ఎమ్మెల్యేగా కొనసాగుతానని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటానని పేర్కొన్నారు.మరోవైపు ఫేస్‌బుక్ వేదికగా 'బిగ్ అప్డేట్ కమింగ్ సూన్' అంటూ ఆమె పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. అయితే దీంతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖను పార్టీ అధిష్ఠానం ఢిల్లీ రావాలంటూ సందేశం పంపడం వెనుక బలమైన కారణం ఉండి ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

# భక్తితో గణనాథుడిని పూజిద్దాం

( మొదటి పేజీ తరువాయి )

ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

దేశంలో ఎక్కడాలేని విధంగా మండపాలకు ఉచిత విద్యుత్ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్‌కు అందించాలని సూచించారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

**మండపాల సమాచారం ముందుగానే ఇవ్వాలి**

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## అసెంబ్లీ సమావేశాలు16వరకు పొడిగింపు

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం మరో రోజుకు పొడిగించింది. శనివారం సభా కార్యక్రమాల అనంతరం అసెంబ్లీని ఈనెల 16వ తేదీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వాయిదా వేశారు. ఆ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22ఏపై సభలో మాట్లాడనున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వనున్న నేపథ్యంలో చర్చకు ప్రాధాన్యం సంతరించుకుంది. 22ఏ అంశంపై శనివారం చర్చ జరిగింది. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. మరోవైపు, ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ కారణంగానే సభా సమావేశాలను మరో రోజు పొడిగించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ నిర్వహించి సీఎం, మంత్రులపై కామెంట్స్ చేసిన నేపథ్యంలో వీటన్నింటికీ సీఎం రేవంత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చి మరోసారి అప్పర్ హ్యాండ్ సాధించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# కేసీఆర్.. మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే చట్టసభలపై నమ్మకం లేదా..?

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్‌పై తెలంగాణ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నిర్వహించింది మాక్ అసెంబ్లీ కాదని.. డెమోక్రసీని గులాబీ పార్టీ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు. శనివారం అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి సీతక్క చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్ నిర్వహించి, ఆ పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే గులాబీ పార్టీ నేతలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆగ్రహించారు. ఇంకా ఆ మైలపోలేదనే ఆధిపత్య దురంహంకారంతో ఆ పార్టీ నేతలు ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్... మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభలపై ,సొంత పార్టీ కార్యక్రమంపై



ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. అధికారంలో ఉంటే సచివాలయానికి రారని.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి కూడా రారా అని నిలదీశారు. ఫాంహౌస్‌ని సచివాలయంగా.. పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు.

# జైలు గోడల మధ్య దుబాసి శంకర్ జీవన పోరాటం



కుటుంబ దీనగాధ.... సహచరిణి ఎన్కౌంటర్లో మృతి. సొంత కోడలు కూడా జైల్లోనే. .మానవత దృక్పథంతో విడుదల చేయాలని కుటుంబీకుల మొర.... ఏడేళ్లుగా భువనేశ్వర్ సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా మగ్గుతున్న మావోయిస్టు నేత అనారోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యుల ఆందోళన.. రాజకీయ ఖైదీల విడుదలకు హక్కుల సంఘాల డిమాండ్

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన మావోయిస్టు నాయకుడు దుబాసి శంకర్ అలియాస్ మహేందర్ అలియాస్ రమేష్ గత ఏడేళ్లుగా ఒడిశాలోని భువనేశ్వర్ సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా ఉన్నారు. ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శంకర్ చాలా కాలంగా జైలులోనే ఉన్నారని, ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని పలు నివేదికలు కూడా పేర్కొన్నాయి.

దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబాసి శంకర్ 1980లలో అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమంలో చేరి అంచెలంచెలుగా ఎదిగి మావోయిస్టు పార్టీలో కీలక నాయకుడిగా గుర్తింపు పొందారు. దుబ్బాక ప్రాంత దళ కమాండర్గా, నర్సాపూర్ ప్రాంత దళ కమాండర్గా, జిల్లా కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా, అనంతరం ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంత కమిటీ సభ్యుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో విప్లవోద్యమ విస్తరణలో ఆయన పాత్ర ఉందని ఉద్యమ వర్గాలు చెబుతున్నాయి. అనేక ఎన్కౌంటర్ల నుంచి తృటిలో తప్పించుకున్న శంకర్, నాలుగు దశాబ్దాలకు పైగా అజ్ఞాత జీవితాన్ని గడిపి మావోయిస్టు పార్టీలో కీలక స్థాయికి ఎదిగారు. 2021లో ఒడిశా పోలీసులు ఆయనను అరెస్టు చేసిన తర్వాత భువనేశ్వర్ సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి వివిధ కేసుల్లో విచారణను ఎదుర్కొంటూ జైలులోనే ఉన్నారు. ఆయనపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయి.

దుబాసి శంకర్ కుటుంబం కూడా ఉద్యమ నేపథ్యంలో తీవ్ర నష్టాలను చవిచూసింది. ఆయన సహచరి శ్రీలత అలియాస్ భారతి ఎన్కౌంటర్లో మరణించగా, కుటుంబంలోని మరికొందరు సభ్యులు కూడా వివిధ సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులు చెదిరిపోయి జీవనం సాగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల శంకర్ ఆరోగ్యం మరింత క్షీణించినట్లు సమాచారం. సరైన వైద్య చికిత్స అందించి మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా వివిధ జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలు, విచారణ ఖైదీల కేసులను వేగంగా పరిష్కరించాలని హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు ప్రభుత్వాలను కోరుతున్నాయి. పీడిత తాడిత ప్రజల కోసం గత 45 ఏళ్లుగా విప్లవోద్యమంలో చురుగ్గా పనిచేసి ప్రజా సమస్యలే పరిష్కారంగా పనిచేసిన ఒక విప్లవ నాయకుడి పరిస్థితి నేడు అత్యంత దయానియంగా మారింది. ఒకవైపు అనారోగ్యం మరోవైపు వయోభారం. మరోవైపు కుటుంబ సమస్యలు చుట్టుముట్టాయి. దుబాషి శంకర్. సహచరిణి లత అలియాస్ భారతి చనిపోవడం. సొంత అన్న కూతురైన దుబాసి గంగవ్వ 1997 జిన్నారం మండలం లక్ష్మాపూర్ ఉమ్మడి మెదక్ జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో చనిపోయింది. మరోవైపు తన సొంత అన్న దుభాషి రాజయ్య. 1996 లో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడినాడు. అప్పట్లోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒక చర్చకు దారి తీసింది. నక్సలైట్లు అంటే డబ్బులు సంపాదిస్తారు అనుకున్నారు కానీ అందుకు విరుద్ధంగా దుబా సి రాజయ్య ఆత్మహత్య తో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఉన్నదనేది అర్థమైంది. గత ఏడు సంవత్సరాలుగా. ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్ సెంట్రల్ జైల్లో రాజకీయ ఖైదీగా జైల్లోనే ఉన్నాడు. 100కు పైగానే కేసు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. కుడి కాల్ ఇన్ఫెక్షన్తో నడవలేని స్థితిలో జైల్లో ఉన్నాడు. అతని ఆరోగ్యం మెరుగుపడాలంటే మెరుగైన వైద్యం అందించేందుకు తెలంగాణ రాష్ట్రం చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించాలని అతని బంధువులు తెలంగాణ ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. మావోయిస్టు పార్టీ లేనప్పుడు జైళ్లలో నిర్బంధించుడు ఎందుకని ప్రజాస్వామికవాదులు. ప్రజలు హక్కుల సంఘాలు ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నాయి. దుబాయి శంకర్ కుటుంబం నేడు చినాభిన్నమైంది. చెట్ల నర్సంపల్లిలో ఎవరు ఉండడం లేదు. ఒకానొక కొడుకు. హైదరాబాదులో ఓ ప్రైవేట్ పరిశ్రమలు పనిచేస్తూ బతుకుతున్నాడు. దుబాసి శంకర్ విడుదల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కి మల్ల రాజిరెడ్డి. తీపిరి తిరుపతి. విన్నవించారు. రాజకీయ ఖైదీలతో పాటు. ఆదివాసి ఖైదీలు సుమారు 6000 మంది విడుదల చేయాలని. ఎలాంటి షరతులు లేకుండా కేసులను ఎత్తివేసి జైలు నుండి విముక్తి కల్పించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2026 ఆగస్టు 15న వెయ్యి మంది ఖైదీలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఏ ఒక్క రాజకీయ ఖైదీని కానీ. ఆదివాసి ఖైదీలు కానీ విడుదల చేయడం లేదు. 1986 లో అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమ నిర్మాతలైన డాక్టర్ అంకం బాబురావు. ఓరుగంటి సుదర్శన్. అలియాస్ మహేందర్. సముద్రుడు. శాఖమూరి అప్పారావు. మేడం బాలకృష్ణతో కలిసి విప్లవోద్యమ నిర్మాణానికి అలుపెరుగని పోరాటాన్ని నిర్వర్తించాడు. ఓరుగంటి సుదర్శన్ కు ప్రియ శిష్యుడు దుబాషి శంకర్. భువనేశ్వర్ సెంట్రల్ జైల్లో రాజకీయ ఖైదీగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కేసులను ఎత్తివేసి విడుదల చేసినట్లయితే ఇంటి వద్ద వృద్ధాప్యంతో ఉంటాడు ఎక్కడ కూడా వెళ్లకుండా ఉంటాడు ప్రభుత్వాలు కనికరించి విడుదల చేయాలని ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. సొంత కోడలైన దుబాసి స్వప్న. ఎన్ ఐ ఏ కేసులో విశాఖపట్నం మహిళా సెంట్రల్ జైల్లో రాజకీయ ఖైదీగా ఉంది. కుటుంబంలో ఇద్దరు నేను నాలుగోడాల మధ్య బంధీలుగా ఉండడం అందరినీ కలిసివేస్తుంది. మానవతా దృక్పథంతో విడుదల చేయాలని ప్రభుత్వాలను వేడుకుంటున్నారు.

**దామరపల్లి నర్సింహారెడ్డి**
**సీనియర్ జర్నలిస్టు**
**9581358696**

# విఘ్నాలను తొలగించే గణపతి

**వినాయకచవితి ప్రత్యేకత ఇదే**



విఘ్నాలను తొలగిస్తాడు.. వినాయకా అంటూనే ఆదుకువాడు.. ఆశివపార్వతుల ముద్దుల కొడుకు పుట్టినరోజే విఘ్నేశ్వరుడి జన్మదినమే వినాయక చవితి. ఏటా భాద్రపద మాసంలో శుక్లపక్ష చవితి రోజున దేశవ్యాప్తంగా ఈపర్వదినాన్ని కన్నుల పండుగగా జరుపుకొంటారు.. భారతీయులకు సమాజంలో వినాయక చవితికి విశిష్టమైన ప్రాముఖ్యం ఉంది, ఆది దంపతుల ప్రథమ కుమారుడైన వినాయకుడిని పూజించనిదే ఏ పనీ ప్రారంభించరు, ఆ.. గణనాథుని కృప ఉంటే అన్నీ విజయాలే లభిస్తాయనేది ప్రజల విశ్వాసం. వినాయకుడికి ఆరాధనలో జ్యోతిషశాస్త్రం ప్రకారం కుజుడు, బుధుడు, కేతు గ్రహాల అనుగ్రహ సిద్ధి ఉంటుంది. ఆవినాయకుడు ధూమకేతు గణాధ్యక్షుడు, మోక్ష కారకత్వానికి అధినాయకుడు కావడంతో కేతు గ్రహానికి అధిపతి అయ్యాడని, బుధుడి అనుగ్రహంతో విద్య, జ్ఞానప్రాప్తి, వ్యాపారాభివృద్ధి కలుగుతుందని, అలాగే, కుజ గ్రహం అనుగ్రహం వివాహ, అన్యోన్య దాంపత్యానికి చిహ్నం.. ఆఒక్క పార్వతీ తనయుడిని ఆరాధించడం వల్ల ఈ మూడు గ్రహాల అనుగ్రహం పొందవచ్చని జ్యోతిషశాస్త్రం పేర్కొంటోంది. గణేశచతుర్థినాడు వినాయక ఆరాధాన కాలాన్ని.. ప్రకృతిని.. జీవుల్ని నియంత్రించే ఈశ్వరుడి అనుగ్రహంతో, అన్ని అవరోధాల్ని అధిగమించడానికి నిర్వహిస్తారు. తుండం అంటే ఖండించడం. విఘ్నేశ్వరుడు వక్రాలన్నింటినీ ఖండించే భవ్య రూపధారి. అభ్యుదయంలో.. పురోగతిలో ఏర్పడే విఘ్నాలే వక్రాలు. అడ్డువచ్చే వక్రాల్ని తొలగించే వక్రతుండ విజయకారకుడు.. వరసిద్ధి వినాయకుడు. గణపతి ఆరాధన యజ్ఞత్వం, దైవత్వం, మంత్రత్వం, ద్రవ్యత్వం అనే నాలుగు అంశాలతో కూడుకున్నదే. వినాయకుడు నాలుగు వేదాల్లో ఆవరించిన వేదమూర్తి, చతుర్భుజుడిగా బీజ, అండ, పిండ, బ్రహ్మాండమంతా వ్యాపించి ఉండే మహోత్కట గణపతి. ఆయనకు చతుర్థినాడు ఉద్భవించిన చిన్మయ చిదానందుడిగా.. నాలుగు సంఖ్య ప్రధానంగా కలిగిన చవితి దేవరగా వినాయకుడు ప్రణతులు అందుకుంటున్నాడు. గజవదనుడిగా.. జగదానంద తేజోమయ ఆనందరూపుడిగా జయకర.. శుభకర వినాయకుడిగా చవితినాడు సాకారమై అనంత సౌభాగ్య సిరుల్ని అనుగ్రహించే ఆహ్లాదపూరితమైన గణేశారాధన పూర్ణత్వమైన ఆనంద యోగసాధన.

**- మహా డెస్క్**



# వికసిత్ భారత్ యావత్ జాతి ఆకాంక్ష






2047... భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల సంవత్సరం. ఆ నాటికి భారతదేశాన్ని ఒక అగ్రశ్రేణి, పూర్తి అభివృద్ధి చెందిన దేశం 'వికసిత్ భారత్' గా నిలపడమే ఇప్పుడు మన ముందున్న అత్యంత భారీ లక్ష్యం. 2022 ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా ఈ ఆలోచనను దేశ ప్రజల ముందుంచారు. ఆయన రగిల్చిన ఈ ఆశయం, ఇప్పుడు దేశ భవిష్యత్తును మార్చే ఒక మహాయజ్ఞంగా మారింది. 'అమృత్ కాల్' అని పిలుచుకుంటున్న ఈ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో గమ్యం చేరాలంటే.. కేవలం పాత పద్ధతులను కొనసాగిస్తే సరిపోదు; అంతకు మించిన సాహసోపేతమైన అడుగులు పడాలి. దేశ పౌరుల కోసం ప్రధాని మోదీ ఇచ్చిన 'పంచ ప్రాణ' అనే ఐదు పవిత్రమైన ప్రతిజ్ఞల మీద ఇది ఆధారపడి ఉంది. 'వికసిత్ భారత్' నిర్మించాలనే ప్రధాన లక్ష్యంతో పాటు, వలసవాద మనస్తత్వపు ఆనవాళ్లను తొలగించడం, స్వదేశీ వారసత్వం పట్ల గర్వపడటం, ప్రాదేశిక మరియు సామాజిక సమగ్రతను బలోపేతం చేయడం, క్రమశిక్షణతో కూడిన పౌర బాధ్యతను సమర్థించడం ఈ ప్రతిజ్ఞల్లో ఉన్నాయి. స్థిరమైన ఆర్థిక పరివర్తన అనేది దానికి తగిన సాంస్కృతిక, పౌర పునరుజ్జీవనం లేకుండా సాకారం కాలేదు అనేది దీని ప్రధాన ఉద్దేశ్యం.

నీతి ఆయోగ్ రూపొందించిన ఈ లక్ష్యం యొక్క ఆర్థిక స్థాయి చాలా ప్రతిష్టాత్మకమైనది. జాతీయ స్థూల దేశీయోత్పత్తిని (జి.డి.పి) 30 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువకు (ఏడు రెట్లు కంటే ఎక్కువ వృద్ధి) పెంచడంతో పాటు, తలసరి ఆదాయాన్ని ఐదు నుండి ఆరు రెట్లు పెంచి 15,000 నుండి 18,000 డాలర్లకు చేర్చాలని ఈ రోడ్మ్యాప్ నిర్దేశించింది. ఈ మైలురాళ్లను సాధించాలంటే దశాబ్దాల పాటు కనీసం ఏడు శాతం వార్షిక వృద్ధి రేటును స్థిరంగా కొనసాగించాలి, ఇది చారిత్రాత్మకంగా చైనా మరియు సింగపూర్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న కొన్ని దేశాలు మాత్రమే సాధించిన రికార్డు. ప్రధాని మోదీ లక్ష్యాలు ఉట్టి కలలు కావు. కోవిడ్ మహమ్మారి ప్రభావాలు, అంతర్జాతీయ వాణిజ్య విధానాల్లో మార్పులు (ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ విధానాల వల్ల ఏర్పడిన ఒడిదుడుకులు), ప్రపంచ ఆర్థిక మాంద్యం భయాలు ఉన్నప్పటికీ, ప్రధాని మోదీ వెనక్కి తగ్గకుండా తన అజెండాపై దృఢంగా నిలబడ్డారు. ఫలితంగా, భారతదేశం బలమైన ఆర్థిక స్థితిస్థాపకతను ప్రదర్శించింది. దేశీయ ఆర్థిక వ్యవస్థ 202324లో 7.3 శాతం, 202425లో 7.2 శాతం మరియు 202526లో 7.8 శాతం వాస్తవ జి.డి.పి వృద్ధిని నమోదు చేసింది, దీని వల్ల 202627 మొదటి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి గణాంకాల చుట్టూ ఉన్న వివాదాలు ఈ స్థిరమైన స్థూల ఆర్థిక పథాన్ని విస్మరిస్తున్నాయని చెప్పవచ్చు.

ఈ వేగాన్ని దీర్ఘకాలిక సామర్థ్యంగా మార్చడానికి, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ తన 'వికసిత్ భారత్' అజెండాను మరింత నొక్కిచెబుతూ.. దానిని 'సప్త ధార' లేదా జాతీయ అభివృద్ధికి సంబంధించిన ఏడు వ్యూహాత్మక విభాగాలుగా వర్గీకరించారు. దేశీయ ఉత్పాదకతను పెంచడం, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్‌ను ఆధునీకరించడం, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లను విస్తరించడం, రక్షణ ఉత్పత్తిలో స్వావలంబన సాధించడం, హరిత మరియు సముద్ర ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్ పవర్‌ను విస్తరించడం వంటివి ఈ ప్రధాన రంగాలలో ఉన్నాయి. ఈ రంగాలలో సరికొత్త శిఖరాలను చేరుకోవాలంటే మన విధానాన్ని పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని స్పష్టం చేశారు. "మనం మన పని సంస్కృతిని మార్చుకోవాలి, దానితో పాటు మన ఆలోచనా విధానాన్ని కూడా మార్చుకోవాలి... సంస్కరణల వేగాన్ని మరింత పెంచాలి" అని ఆయన గట్టిగా కోరారు.

చారిత్రక పరివర్తనలు ఎప్పుడూ సరళ రేఖలో సాగవు. దశాబ్దాలలో జరగనిది కొన్ని వారాల్లో జరుగుతుందని వ్లాదిమిర్ లెనిన్ చెప్పిన చారిత్రక మాటలను గుర్తుచేసుకుంటూ, ప్రధాని మోదీ కూడా అటువంటి భావాన్నే వ్యక్తపరిచారు. "గత ఐదు నుండి ఏడు దశాబ్దాలుగా మనం సాధించలేని పని వేగాన్ని, రాబోయే 57 సంవత్సరాలలో మనం సాధించాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి వేగవంతమైన పరివర్తనలకు స్పష్టమైన చారిత్రక ఉదాహరణలు ఉన్నాయి. 1978 మరియు 1997 మధ్య, డెంగ్ జియావోపింగ్ చైనాను సైద్ధాంతిక పరిమితుల నుండి తప్పించి ఆచరణాత్మకమైన మార్కెట్ ఆధారిత సంస్కరణల వైపు నడిపించారు, ఆధునిక చరిత్రలో అత్యంత నాటకీయమైన ఆర్థిక విస్తరణలలో ఒకదానికి ఆయన రూపకల్పన చేశారు. 1980లో, ఈ రెండు ఆసియా దేశాల ఆర్థిక స్థితి దాదాపు సమానంగా ఉండేది: చైనా జి.డి.పి 303 బిలియన్ డాలర్లు కాగా, భారతదేశం 186 బిలియన్ డాలర్లుగా ఉండేది. ఒక సగటు భారతీయుని తలసరి ఆదాయం 582 డాలర్లతో చైనా (307 డాలర్లు) కంటే ముందుండేది. ఆ తర్వాతి రెండు దశాబ్దాలలో, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, సరఫరా గొలుసుల పట్ల చైనా చూపిన తీవ్రమైన శ్రద్ధ దానిని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చింది. 2000 నాటికి, చైనా జి.డి.పి 1.21 ట్రిలియన్ డాలర్లకు విస్తరించింది, తలసరి ఆదాయం 959 డాలర్లకు చేరుకుంది, కాగా భారతదేశం 468 బిలియన్ డాలర్ల జి.డి.పి ని మాత్రమే సాధించింది.

తరువాతి దశాబ్దాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సేవల కేంద్రంగా భారతదేశం తనను తాను విజయవంతంగా స్థిరపరచుకున్నప్పటికీ, అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే సాధారణ వృద్ధికి మించిన అద్భుతమైన ప్రగతిని సాధించాలని ప్రధాని మోదీ కృతనిశ్చయంతో ఉన్నారు. "మనం నిర్దేశించుకున్న లక్ష్యాలు, ఆశయాల స్థాయిని మించి పనిచేయాలి" అని ఆయన దేశ ప్రజలకు ఇచ్చిన పిలుపులో ఆదార్శనికత కనిపిస్తుంది. ఆయన లేవనెత్తిన ప్రశ్నలు మనల్ని ఆలోచింపజేస్తాయి: ఫార్చ్యూన్ 500 జాబితాలో మన దేశానికి చెందిన యాభై భారతీయ కార్పొరేషన్లు ఎందుకు ఉండకూడదు? ప్రపంచంలోని ప్రముఖ బ్యాంకింగ్ సంస్థలలో మన స్వదేశీ బ్యాంకులు ఎందుకు ఉండకూడదు? ఫార్మాస్యూటికల్స్, మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, అకౌంటింగ్‌లో మన సంస్థలు అగ్రశ్రేణి ప్రపంచ నాయకులుగా ఎందుకు ఎదగకూడదు? ప్రధాని లేవనెత్తిన ఈ ప్రశ్నలకు ఒకే ఒక్క సమాధానం.. దేశంలోని బ్యూరోక్రసీ, రాష్ట్ర మరియు స్థానిక ప్రభుత్వాలు, పారిశ్రామిక వేత్తలు, వ్యవసాయ, విద్యా, సాంకేతిక రంగాల నాయకులు అందరూ ప్రధాని వేగాన్ని అందుకోవడమే. వికసిత్ భారత్ అనేది యావత్ జాతి ఆకాంక్షగా మారాలి!



**(శివకుమార్ గనివాడ, సీనియర్ సోషల్ అనలిస్ట్, ganiwada@zohomail.in)**




# సింగరేణి సంక్షేమానికి పెద్దపీట..

- 2026–27 సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం
- క్రీడలు, విద్య, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి..
- ఉద్యోగులు, కుటుంబాల సంక్షేమమే లక్ష్యం..
- మణుగూరు ఏరియా జీఎం రామచందర్

**మణుగూరు, మహా** : సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ 2026-27 సంవత్సరంలో విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. మణుగూరు ఏరియాలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు క్రీడలు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను కేవలం ప్రతిపాదనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

**క్రీడలకు పెద్దపీట..**

సింగరేణి సంస్థ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. 2026-27 సంవత్సరానికి క్రీడలు, క్రీడా సామగ్రి, క్రీడా మైదానాలు, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర అవసరాల కోసం రూ.1.35 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులతో పోలిస్తే ఈసారి క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇచ్చేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి పిల్లల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు వివిధ పోటీలు నిర్వహించడంతోపాటు క్రీడాకారులకు అవసరమైన సామగ్రి, సౌకర్యాలను అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

**విద్య, వైద్యానికి ప్రాధాన్యం**

ఉద్యోగుల పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడంతోపాటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సంక్షేమ కార్యక్రమాల ద్వారా విద్య, వైద్యం, క్రీడలతోపాటు ఉద్యోగ కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. కాలనీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతులను ఎప్పటికప్పుడ పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చి నిధులను సద్వినియోగం చేయాలని సూచించారు.

రూ.20.50 లక్షలతో సంక్షేమ కార్యక్రమాలు

2026-27 సంవత్సరానికి వివిధ సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులు, వారి కుటుంబాల అవసరాలకు సంబంధించి 11 విభాగాలకు కలిపి రూ.20.50 లక్షల బడ్జెట్‌ను కేటాయించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఇందులో మణుగూరు ఏరియాకు రూ.2 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన నిధులను అవసరమైన సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

పరిసర ప్రాంతాల అభివృద్ధిపైనా దృష్టి

సింగరేణి కార్యకలాపాలు కొనసాగుతున్న పరిసర ప్రాంతాల్లోనూ అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు. సీఈఆర్, పీసీఓఏ నిధుల ద్వారా అవసరమైన ప్రాంతాల్లో సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని నిర్ణయించారు. సింగరేణి ఉద్యోగుల సంక్షేమంతోపాటు సంస్థ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు.

**ఉద్యోగుల సూచనలకు ప్రాధాన్యం**

సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ ధర్మ రామచందర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులకు ఉపయోగపడే కార్యక్రమాలను గుర్తించి వాటిని సకాలంలో అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జనరల్ మేనేజర్ వెంకట రామారావు, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ డిప్యూటీ జీఎం రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రంగశేఖర్, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి కృష్ణయ్య, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ మోహన్ నాయక్, సివిల్ విభాగం డిప్యూటీ జనరల్ జీఎం హరి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ యాకూబ్, పర్సనల్ మేనేజర్ రాజు, సీనియర్ పర్సనల్ అధికారి సతీష్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పర్యావరణహిత గణేష్ విగ్రహాల పంపిణీ

**కుషాయిగూడ, మహా** : పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320హెచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ఈసీఐఎల్‌లోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్ట్రిక్ట్ సెక్రటరీ-గ్లోబల్ కాజెస్ లయన్ కొత్తపల్లి రాంబాబు నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్, విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బందికి విగ్రహాలను అందజేశారు. డిస్ట్రిక్ట్ 320 హెచ్ పరిధిలో ఈ ఏడాది లయన్స్ సభ్యులు, అధికారులు, ప్రజలకు కలిపి సుమారు 2,500 పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ చేసినట్లు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లయన్స్ సభ్యులు చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. కుషాయిగూడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాన్ని ప్రశంసించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖకు లయన్స్ సభ్యులు సహకరించాలని కోరారు. మాజీ కార్పొరేటర్, లయన్స్ క్లబ్ హాస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు మాట్లాడుతూ సామాజిక అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సేవా కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ నాయకులు కోట వెంకట్ రెడ్డి, ఎం. మోహన్, బాలవాసి వెంకటేశ్వర్లు, పెద్ది శ్రీనివాస్, దివాకర్, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్ప సర్పంచ్లకు చెక్ పవర్ కొనసాగించాలి

**ఉప్ప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అవిషిపేట ఆంజనేయులు గౌడ్**

మొయినాబాద్ మహా: రాష్ట్రంలో ఉప్ప సర్పంచులకు ప్రస్తుతం ఉన్న హక్కులు, చెక్ పవర్ ను కొనసాగిస్తూ గ్రామాల అభివృద్ధిలో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఉప్ప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిన్నమంగళారం ఉప్ప సర్పంచ్ అవిషిపేట ఆంజనేయులు గౌడ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ. ఉప్ప సర్పంచుల పదవికి సంబంధించి వస్తున్న పుకార్లను ప్రభుత్వం కొట్టివేయాలని, గతంలో మాదిరిగానే చెక్ పవర్ కొనసాగించడంతో పాటు నెలకు రూ.5 వేలగౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాలపై ఉప్ప సర్పంచుల పేర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ పరిధిలోని



ప్రతి తీర్మానంపై సర్పంచ్ పంచాయతీ కార్యదర్శితో పాటు ఉప్ప సర్పంచ్ సంతకం తప్పనిసరి చేయాలని, ప్రభుత్వం అనుమతించిన అభివృద్ధి పనులు, కార్యక్రమాల సమాచారాన్ని ఉప్ప సర్పంచులకు అందించాలని కోరారు మండల సర్వసభ్య సమావేశాలకు ఉప్ప సర్పంచులను ఆహ్వానించి గ్రామాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచాలని పేర్కొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరగా పరిష్కరించి, అధికారాలను కాపాడాలని కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- పెండింగ్ నోటీసుల పై ప్రత్యేక దృష్టి
- రోజువారీ లక్ష్యాలను సాధించాలి
- జూమ్ మీటింగ్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు

**ఆదిలాబాద్ మహా:** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తులు, ఫారాల డిస్పోజల్‌లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు రోజువారీ కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు.శనివారం తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు సంబంధిత అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారం, ఫారాల డిస్పోజల్ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఏఈఆర్వో పరిధిలో సుమారు 26 వేల నోటీసులు డెలివరీకి పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు సుమారు 600 హియరింగ్‌లు మాత్రమే పూర్తికావడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ నోటీసుల డెలివరీతో పాటు హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. బోథ్ మండలంతో పాటు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోనూ పెండింగ్



కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రక్రియకు నవంబర్ 5వ తేదీ తుది గడువు ఉన్నందున, అందుబాటులో ఉన్న పనిదినాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రతి రోజూ కనీసం 900 నోటీసులు, దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసేలా మండలాల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. రోజువారీ పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత ఓటర్లకు వంద శాతం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసుల డెలివరీ అనంతరం హియరింగ్‌లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత ఫారాలను వెంటనే డిస్పోజ్ చేయాలని సూచించారు.ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఫస్ట్ డాక్యుమెంట్, సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు 1987కు ముందు, 2002కు ముందు, 2004 తర్వాత కాలానికి సంబంధించిన పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన పత్రాలను నిబంధనల మేరకు రిటర్నింగ్ అధికారికి పంపాలని, పత్రాల పరిశీలనలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం6, తొలగింపులు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారం7, సవరణలకు సంబంధించిన ఫారం8 దరఖాస్తులు క్షేత్రస్థాయి నుంచి సంబంధిత కార్యాలయాలకు సకాలంలో చేరేలా బీఎల్‌వోలు, ఏఈఆర్వోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పన అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులైన పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిర్దేశిత లక్ష్యాలను ప్రతిరోజూ సాధిస్తూ ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ జూమ్ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వినాయక చవితిని పురస్కరించుకుని సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ (పి అండ్ పి) జి. దేవేందర్ మట్టి వినాయక ప్రతిమలు, పవిత్ర మారేడు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. జనరల్ మేనేజర్ (ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్రీ) బి. సైదులు మాట్లాడుతూ సింగరేణి ఏటా మట్టి వినాయకులను పంపిణీ చేస్తోందన్నారు. పచ్చదనం, జీవవైవిధ్య పరిరక్షణ కోసం మారేడు మొక్కలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.





# సర్కార్ భూమికి కాపలా కాస్తున్న గురునానక్ కళాశాల..?

- అధికారులకు పని తప్పిస్తున్న గురునానక్ యాజమాన్యం.!
- సర్కార్ భూమి అని గుర్తించిన ఆగని అక్రమ నిర్మాణాలు...
- అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దాంగా సర్కార్ భూమి కబ్జాలు.?
- ఓయూ జేఏసీ నాయకుడు జోగు నరేందర్

ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 12 మహా: గురునానక్ కళాశాల యాజమాన్యం సర్కార్ భూమిని ఆక్రమించిందనే ఆరోపణలు ప్రజలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సుమారు ఐదెకరాల సర్కార్ భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు వెలువెత్తాయి. గతంలో రెవెన్యూ అధికారిని అప్పటి ఆ ర్ఐ పుష్పలత, పోలీస్ సిబ్బందితో కలిసి, గురునానక్ కళాశాల ఆవరణలో సర్కారు భూమి కబ్జాకు గురైనట్లు గుర్తించి సూచిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. అయితే అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును మరుసటి రోజే కనిపించకుండా పోవడంతో పలు అనుమానాలకు దారితీసింది.

**సర్కార్ భూమి అని గుర్తించిన ఆగని అక్రమ నిర్మాణాలు...**

వరుస సర్కార్ రావడంతో గతంలో గుర్తించిన సర్కారు భూమిలో కళాశాల యాజమాన్యం నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆరోపణలు రావడంతో, ఓయూ జేఏసీ నాయకుడు జోగు నరేందర్ అభ్యంతరం వ్యక్తం చేసి, పనులను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు మాయమైన ఘటనపై, అలాగే సర్కార్ భూమిలో తిరిగి నిర్మాణాలు చేపట్టడం పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సర్కార్ భూమిని పరిరక్షించడంతో పాటు ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని, జోగు నరేందర్ సర్కార్ ను డిమాండ్ చేశారు.

# సీతారాం ఏచూరి మార్క్సిస్టు మహా మేధావి

వలిగొండ సెప్టెంబర్ 12 మహా న్యూస్ : సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మహా మేధావని ఆయన మరణం భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు శనివారం రోజున సిపిఎం వలిగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సిపిఎం కార్యాలయం వద్ద జరిగింది ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మహా మేధావని ఆయన మరణం సిపిఎం ఉద్యమానికే కాకుండా దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని అన్నారు దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేసిన గొప్ప నాయకుడని అన్నారు యూపీఏ మొదటి ప్రభుత్వంలో అనేక చట్టాలను సాధించడంలో వాటిని రూపకల్పన చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన మేధావన్నారు ఉపాధి హామీ చట్టం,అటవీ హక్కుల చట్టం సమాచార హక్కు చట్టం లాంటి చట్టాలను ప్రజలకు అందించాలని దృఢ సంకల్పంతో పనిచేసిన నాయకుడన్నారు గత 40 సంవత్సరాల నుండి దేశ రాజకీయాల్లో విద్యార్థి ఉద్యమాల నుండి మొదలుకొని యువజన,కార్మిక ప్రజా పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని దేశం ఒక సామాజిక వేత్తను కోల్పోయిందని అన్నారు రాజ్యసభ సభ్యులుగా దేశవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడి కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని మెడలు వంచడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకున్ని కోల్పోవడం ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని ఆయన ఆశయ మార్గంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అప్పుడే ఆయన ఆశయాలను సాధించిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్,దుబ్బ లింగం, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు, వేముల లక్ష్మయ్య, కొండూరు సత్తయ్య,శీలం ఇందిర,ద్యానబోయిన యాదగిరి,తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై పోరాటాలు

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు విలాస్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి గ్రామంలో జరిగిన 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలకు ఆయన జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, పట్టణ కార్యదర్శి కట్ట చంద్రమౌళితో కలిసి హాజరయ్యారు. భీంసరి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, కామ్రేడ్స్ పండరినాథ్, రామయ్య, పార్ల విట్టల్, పూర్ణచందర్ స్మారక స్థూపాల వద్ద నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, పేద ప్రజల హక్కుల కోసం జరిగిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాల




కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాటంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాజంగుల రాజు, బత్తుల గంగారెడ్డి, బత్తుల రాజన్న, రామ్ రెడ్డి, సిసిలే దయానంద్, లక్ష్మి, యశోద, తుల్సి నర్సింగ్, చందా కిష్టయ్య, గంగారాం, గుండ్ల శ్రీను, ఖాళ్ళ నర్సింగ్, చంటి, మల్లేష్ సీపీఐ కార్యకర్తలు, పాల్గొన్నారు.



# లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం..

**మణుగూరు, మహా :** లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకొని కక్షిదారులు ప్రశాంతమైన జీవితాన్ని పొందాలని మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి సూచించారు. మణుగూరు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల కక్షిదారులకు విలువైన సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందన్నారు. వివాదాలను సంవత్సరాల తరబడి కొనసాగించడం వల్ల ఇరుపక్షాలు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని, రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో పట్టింపులకు పోకుండా సామరస్యపూర్వక పరిష్కారానికి ముందుకు రావాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన వివాదం ఇరుపక్షాల మధ్య విభేదాలను తగ్గించి సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పరుస్తుందని పేర్కొన్నారు. న్యాయవాదులు కూడా తమ కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, రాజీకి అనువైన కేసులను పరిష్కరించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. న్యాయవ్యవస్థ అందిస్తున్న ప్రత్యామ్నాయ వివాద పరిష్కార అవకాశాలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా సత్వర న్యాయం పొందడంతోపాటు కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించేందుకు సహకరించాలని మేజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి పేర్కొన్నారు.

**మొత్తంగా 342 కేసులు పరిష్కారం..**

అనంతరం నిర్వహించిన లోక్ అదాలతో మొత్తంగా 342 కేసులు పరిష్కారం అయ్యాయి. వీటిలో పోలీస్, ప్రైవేట్ కేసులు కలిపి 94 కేసులు పరిష్కారం కాదా రూ.38,49,400/ లు జరిమానా, సెటిల్మెంట్ ద్వారా చెల్లింపులు జరిగాయి. వీటితోపాటు 244 పెట్టి కేసులలో కక్షిదారులు నేరం అంగీకరించడంతో వారికి మొత్తంగా రూ.1,96,800/లు జరిమానా విధించింది. ఈ చలానా కేసులు 52 పరిష్కారం కాగా రూ. 23,400/ రాజీ పడిన కేసులలోని దక్షిదారులకు అవార్డు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాని గురు కృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, ప్రధాన కార్యదర్శి వీర మధుసూదన్, ఉపాధ్యక్షురాలు సావిత్రి, సీనియర్ న్యాయవాదులు పొనుగోటి [illegible]షన్ రావు, జాడి చొక్కయ్య, అమృతలూరి రామ్మోహన్ రావు, చిర్రా రవికుమార్, మేదరమెట్ల శ్రీనివాస్ రావు, న్యాయవాదులు చిర్ర సరస్వతి, సర్వేశ్వర రావు, సంధ్య, వాసవి తదితరులు పాల్గొన్నారు.

# "క్యూర్-2026" బిల్లు.. చరిత్రలో నిలిచిపోతుంది.!

- బిల్లులోని అంశాలన్నీ పకడ్బందీగా అమలయ్యేలా చూడాలి... ఎమ్మెల్యే మల్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 12 మహా:** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌ను లండన్ , డల్లాస్ చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపించారని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ నగరం కోసం డెబ్బైఏళ్లలో ఎవరూ ఆలోచించని రీతిలో... ఎంతో దూరదృష్టితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యూర్ బిల్లు తెచ్చారని ఆయన చెప్పారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చలో భాగంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడారు.



**ఇప్పటికే పదిరెట్ల జనాభా పెరిగింది...**

డెబ్బై ఏళ్ల క్రితం హైదరాబాద్ నగరం కోసం చట్టం చేసిన నాటికి, ఇప్పటికే పదిరెట్ల జనాభా పెరిగిందని... తెలంగాణ జనాభాలో సగం మంది హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే నివాసం ఉంటున్నారని ఆయన చెప్పారు. మారిన పరిస్థితులకనుగుణంగా ప్రజలకు సమగ్ర పరిపాలన అందించే లక్ష్యంతో సీఎం రేవంత్ తెచ్చిన ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేస్తే... నగర చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. నగరం నలువైపులా విస్తరిస్తున్న తరుణంలో జీహెచ్‌ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేయటం గొప్పనిర్ణయంగా మల్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ నాయకులు మాటలు చెప్పటానికే సరిపోయిందని... వారిలాగా కాకుండా తీసుకున్న ప్రతీనిర్ణయాన్ని పకడ్బందీగా అమలుచేయాల్సిన అవసరముందన్నారు.

**ప్రతీనెలా సమన్వయకమిటీ పర్యవేక్షించాలి....**

జీహెచ్‌ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రాలు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండదన్న మల్‌రెడ్డి... బిల్లులో పేర్కొన్నట్టుగా మూడ్నెళ్లకోసారి కాకుండా ప్రతీనెలా సమన్వయకమిటీ పర్యవేక్షిస్తే ఉత్తమమని సూచించారు. నిర్దేశించుకున్న సమన్వయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారయంత్రాంగాన్ని నడిపించాలని చెప్పారు. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ఈ బిల్లులోని అంశాన్నీ పూర్తిస్థాయిలో అమలైతే నగరవాసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉంటారని ఎమ్మెల్యే రంగారెడ్డి చెప్పారు.




# సింగరేణి సంక్షేమానికి పెద్దపీట..

- 2026–27 సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం
- క్రీడలు, విద్య, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి..
- ఉద్యోగులు, కుటుంబాల సంక్షేమమే లక్ష్యం..
- మణుగూరు ఏరియా జీఎం రామచందర్

**మణుగూరు, మహా :** సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ 2026-27 సంవత్సరంలో విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. మణుగూరు ఏరియాలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు క్రీడలు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను కేవలం ప్రతిపాదనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

**క్రీడలకు పెద్దపీట..**

సింగరేణి సంస్థ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. 2026-27 సంవత్సరానికి క్రీడలు, క్రీడా సామగ్రి, క్రీడా మైదానాలు, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర అవసరాల కోసం రూ.1.35 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులతో పోలిస్తే ఈసారి క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇచ్చేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి పిల్లల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు వివిధ పోటీలు నిర్వహించడంతోపాటు క్రీడాకారులకు అవసరమైన సామగ్రి, సౌకర్యాలను అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

**విద్య, వైద్యానికి ప్రాధాన్యం**

ఉద్యోగుల పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడంతోపాటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సంక్షేమ కార్యక్రమాల ద్వారా విద్య, వైద్యం, క్రీడలతోపాటు ఉద్యోగ కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. కాలనీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చి నిధులను సద్వినియోగం చేయాలని సూచించారు.

రూ.20.50 లక్షలతో సంక్షేమ కార్యక్రమాలు

2026-27 సంవత్సరానికి వివిధ సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులు, వారి కుటుంబాల అవసరాలకు సంబంధించి 11 విభాగాలకు కలిపి రూ.20.50 లక్షల బడ్జెట్‌ను కేటాయించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఇందులో మణుగూరు ఏరియాకు రూ.2 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన నిధులను అవసరమైన సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

పరిసర ప్రాంతాల అభివృద్ధిపైనా దృష్టి

సింగరేణి కార్యకలాపాలు కొనసాగుతున్న పరిసర ప్రాంతాల్లోనూ అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు. సీఈఆర్, పీసీఓఏ నిధుల ద్వారా అవసరమైన ప్రాంతాల్లో సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని నిర్ణయించారు. సింగరేణి ఉద్యోగుల సంక్షేమంతోపాటు సంస్థ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు.

**ఉద్యోగుల సూచనలకు ప్రాధాన్యం**

సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ ధర్మ రామచందర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులకు ఉపయోగపడే కార్యక్రమాలను గుర్తించి వాటిని సకాలంలో అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జనరల్ మేనేజర్ వెంకట రామారావు, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ డిప్యూటీ జీఎం రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రంగశేఖర్, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి కృష్ణయ్య, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ మోహన్ నాయక్, సివిల్ విభాగం డిప్యూటీ జనరల్ జీఎం హరి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ యాకూబ్, పర్సనల్ మేనేజర్ రాజు, సీనియర్ పర్సనల్ అధికారి సతీష్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పర్యావరణహిత గణేష్ విగ్రహాల పంపిణీ

**కుషాయిగూడ, మహా :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320హెచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ఈసీఐఎల్‌లోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్ట్రిక్ట్ సెక్రటరీ-గ్లోబల్ కాజెస్ లయన్ కొత్తపల్లి రాంబాబు నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్, విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బందికి విగ్రహాలను అందజేశారు. డిస్ట్రిక్ట్ 320 హెచ్ పరిధిలో ఈ ఏడాది లయన్స్ సభ్యులు, అధికారులు, ప్రజలకు కలిపి సుమారు 2,500 పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ చేసినట్లు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లయన్స్ సభ్యులు చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. కుషాయిగూడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాన్ని ప్రశంసించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖకు లయన్స్ సభ్యులు సహకరించాలని కోరారు. మాజీ కార్పొరేటర్, లయన్స్ క్లబ్ హాస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు మాట్లాడుతూ సామాజిక అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సేవా కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ నాయకులు కోట వెంకట్ రెడ్డి, ఎం. మోహన్, బాలవాసి వెంకటేశ్వర్లు, పెద్ది శ్రీనివాస్, దివాకర్, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్ప సర్పంచ్లకు చెక్ పవర్ కొనసాగించాలి

**ఉప్ప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అవిషిపేట ఆంజనేయులు గౌడ్**



మొయినాబాద్ మహా: రాష్ట్రంలో ఉప్ప సర్పంచులకు ప్రస్తుతం ఉన్న హక్కులు, చెక్ పవర్‌ను కొనసాగిస్తూ గ్రామాల అభివృద్ధిలో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఉప్ప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిన్న మంగళారం ఉప్ప సర్పంచ్ అవిషిపేట ఆంజనేయులు గౌడ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ. ఉప్ప సర్పంచుల పదవికి సంబంధించి వస్తున్న పుకార్లను ప్రభుత్వం కొట్టివేయాలని, గతంలో మాదిరిగానే చెక్ పవర్ కొనసాగించడంతో పాటు నెలకు రూ.5 వేలగౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాలపై ఉప్ప సర్పంచుల పేర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ పరిధిలోని ప్రతి తీర్మానంపై సర్పంచ్ పంచాయతీ కార్యదర్శితో పాటు ఉప్ప సర్పంచ్ సంతకం తప్పనిసరి చేయాలని, ప్రభుత్వం అనుమతించిన అభివృద్ధి పనులు, కార్యక్రమాల సమాచారాన్ని ఉప్ప సర్పంచులకు అందించాలని కోరారు మండల సర్వసభ్య సమావేశాలకు ఉప్ప సర్పంచులను ఆహ్వానించి గ్రామాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచాలని పేర్కొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరగా పరిష్కరించి, అధికారాలను కాపాడాలని కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- పెండింగ్ నోటీసుల పై ప్రత్యేక దృష్టి
- రోజువారీ లక్ష్యాలను సాధించాలి
- జూమ్ మీటింగ్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు



**ఆదిలాబాద్ మహా:** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తులు, ఫారాల డిస్పోజల్‌లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు రోజువారీ కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు.శనివారం తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు సంబంధిత అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారం, ఫారాల డిస్పోజల్ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఏఈఆర్వో పరిధిలో సుమారు 26 వేల నోటీసులు డెలివరీకి పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు సుమారు 600 హియరింగ్‌లు మాత్రమే పూర్తికావడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ నోటీసుల డెలివరీతో పాటు హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. బోథ్ మండలంతో పాటు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోనూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రక్రియకు నవంబర్ 5వ తేదీ తుది గడువు ఉన్నందున, అందుబాటులో ఉన్న పనిదినాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రతి రోజూ కనీసం 900 నోటీసులు, దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసేలా మండలాల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. రోజువారీ పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత ఓటర్లకు వంద శాతం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసుల డెలివరీ అనంతరం హియరింగ్‌లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత ఫారాలను వెంటనే డిస్పోజ్ చేయాలని సూచించారు.ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఫస్ట్ డాక్యుమెంట్, సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు 1987కు ముందు, 2002కు ముందు, 2004 తర్వాత కాలానికి సంబంధించిన పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన పత్రాలను నిబంధనల మేరకు రిటర్నింగ్ అధికారికి పంపాలని, పత్రాల పరిశీలనలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం6, తొలగింపులు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారం7, సవరణలకు సంబంధించిన ఫారం8 దరఖాస్తులు క్షేత్రస్థాయి నుంచి సంబంధిత కార్యాలయాలకు సకాలంలో చేరేలా బీఎల్‌వోలు, ఏఈఆర్వోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పన అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులైన పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిర్దేశిత లక్ష్యాలను ప్రతిరోజూ సాధిస్తూ ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ జూమ్ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వినాయక చవితిని పురస్కరించుకుని సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ (పి అండ్ పి) జి. దేవేందర్ మట్టి వినాయక ప్రతిమలు, పవిత్ర మారేడు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. జనరల్ మేనేజర్ (ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్రీ) బి. సైదులు మాట్లాడుతూ సింగరేణి ఏటా మట్టి వినాయకులను పంపిణీ చేస్తోందన్నారు. పచ్చదనం, జీవవైవిధ్య పరిరక్షణ కోసం మారేడు మొక్కలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.






# సర్కార్ భూమికి కాపలా కాస్తున్న గురునానక్ కళాశాల..?

- అధికారులకు పని తప్పిస్తున్న గురునానక్ యాజమాన్యం.!
- సర్కార్ భూమి అని గుర్తించిన ఆగని అక్రమ నిర్మాణాలు...
- అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దాంగా సర్కార్ భూమి కబ్జాలు.?
- ఓయూ జేఏసీ నాయకుడు జోగు నరేందర్

ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 12 మహా: గురునానక్ కళాశాల యాజమాన్యం సర్కార్ భూమిని ఆక్రమించిందనే ఆరోపణలు ప్రజలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సుమారు ఐదెకరాల సర్కార్ భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు వెలువెత్తాయి. గతంలో రెవెన్యూ అధికారిని అప్పటి ఆ ర్ఐ పుష్పలత, పోలీస్ సిబ్బందితో కలిసి, గురునానక్ కళాశాల ఆవరణలో సర్కారు భూమి కబ్జాకు గురైనట్లు గుర్తించి సూచిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. అయితే అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును మరుసటి రోజే కనిపించకుండా పోవడంతో పలు అనుమానాలకు దారితీసింది.

**సర్కార్ భూమి అని గుర్తించిన ఆగని అక్రమ నిర్మాణాలు...**

వరుస సర్కార్ రావడంతో గతంలో గుర్తించిన సర్కారు భూమిలో కళాశాల యాజమాన్యం నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆరోపణలు రావడంతో, ఓయూ జేఏసీ నాయకుడు జోగు నరేందర్ అభ్యంతరం వ్యక్తం చేసి, పనులను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు మాయమైన ఘటనపై, అలాగే సర్కార్ భూమిలో తిరిగి నిర్మాణాలు చేపట్టడం పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సర్కార్ భూమిని పరిరక్షించడంతో పాటు ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని, జోగు నరేందర్ సర్కార్‌ను డిమాండ్ చేశారు.




# లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం..

**మణుగూరు, మహా :** లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకొని కక్షిదారులు ప్రశాంతమైన జీవితాన్ని పొందాలని మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి సూచించారు. మణుగూరు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల కక్షిదారులకు విలువైన సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందన్నారు. వివాదాలను సంవత్సరాల తరబడి కొనసాగించడం వల్ల ఇరుపక్షాలు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని, రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో పట్టింపులకు పోకుండా సామరస్యపూర్వక పరిష్కారానికి ముందుకు రావాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన వివాదం ఇరుపక్షాల మధ్య విభేదాలను తగ్గించి సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పరుస్తుందని పేర్కొన్నారు. న్యాయవాదులు కూడా తమ కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, రాజీకి అనువైన కేసులను పరిష్కరించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. న్యాయవ్యవస్థ అందిస్తున్న ప్రత్యామ్నాయ వివాద పరిష్కార అవకాశాలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా సత్వర న్యాయం పొందడంతోపాటు కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించేందుకు సహకరించాలని మేజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి పేర్కొన్నారు.

**మొత్తంగా 342 కేసులు పరిష్కారం..**

అనంతరం నిర్వహించిన లోక్ అదాలత్‌తో మొత్తంగా 342 కేసులు పరిష్కారం అయ్యాయి. వీటిలో పోలీస్, ప్రైవేట్ కేసులు కలిపి 94 కేసులు పరిష్కారం కాదా రూ.38,49,400/ లు జరిమానా, సెటిల్మెంట్ ద్వారా చెల్లింపులు జరిగాయి. వీటితోపాటు 244 పెట్టి కేసులలో కక్షిదారులు నేరం అంగీకరించడంతో వారికి మొత్తంగా రూ.1,96,800/లు జరిమానా విధించింది. ఈ చలానా కేసులు 52 పరిష్కారం కాగా రూ. 23,400/ రాజీ పడిన కేసులలోని దక్షిదారులకు అవార్డు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాని గురు కృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, ప్రధాన కార్యదర్శి వీర మధుసూదన్, ఉపాధ్యక్షురాలు సావిత్రి, సీనియర్ న్యాయవాదులు పొనుగోటి ిషన్ రావు, జాడి చొక్కయ్య, అమృతలూరి రామ్మోహన్ రావు, చిర్రా రవికుమార్, మేదరమెట్ల శ్రీనివాస్ రావు, న్యాయవాదులు చిర్ర సరస్వతి, సర్వేశ్వర రావు, సంధ్య, వాసవి తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి మార్క్సిస్టు మహా మేధావి

వలిగొండ సెప్టెంబర్ 12 మహా న్యూస్ : సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మహా మేధావని ఆయన మరణం భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు శనివారం రోజున సిపిఎం వలిగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సిపిఎం కార్యాలయం వద్ద జరిగింది ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మహా మేధావని ఆయన మరణం సిపిఎం ఉద్యమానికే కాకుండా దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని అన్నారు దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేసిన గొప్ప నాయకుడని అన్నారు యూపీఏ మొదటి ప్రభుత్వంలో అనేక చట్టాలను సాధించడంలో వాటిని రూపకల్పన చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన మేధావన్నారు ఉపాధి హామీ చట్టం,అటవీ హక్కుల చట్టం సమాచార హక్కు చట్టం లాంటి చట్టాలను ప్రజలకు అందించాలని దృఢ సంకల్పంతో పనిచేసిన నాయకుడన్నారు గత 40 సంవత్సరాల నుండి దేశ రాజకీయాల్లో విద్యార్థి ఉద్యమాల నుండి మొదలుకొని యువజన,కార్మిక ప్రజా పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని దేశం ఒక సామాజిక వేత్తను కోల్పోయిందని అన్నారు రాజ్యసభ సభ్యులుగా దేశవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడి కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని మెడలు వంచడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకున్ని కోల్పోవడం ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని ఆయన ఆశయ మార్గంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అప్పుడే ఆయన ఆశయాలను సాధించిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్,దుబ్బ లింగం, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు, వేముల లక్ష్మయ్య, కొండూరు సత్తయ్య,శీలం ఇందిర,ద్యానబోయిన యాదగిరి,తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై పోరాటాలు




**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు విలాస్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి గ్రామంలో జరిగిన 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలకు ఆయన జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, పట్టణ కార్యదర్శి కట్ట చంద్రమౌళితో కలిసి హాజరయ్యారు. భీంసరి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, కామ్రేడ్స్ పండరినాథ్, రామయ్య, పార్ల విట్టల్, పూర్ణచందర్ స్మారక స్థూపాల వద్ద నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, పేద ప్రజల హక్కుల కోసం జరిగిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాటంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాజంగుల రాజు, బత్తుల గంగారెడ్డి, బత్తుల రాజన్న, రామ్ రెడ్డి, సిసిలే దయానంద్, లక్ష్మి, యశోద, తుల్సి నర్సింగ్, చందా కిష్టయ్య, గంగారాం, గుండ్ల శ్రీను, ఖాళ్ళ నర్సింగ్, చంటి, మల్లేష్ సీపీఐ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# "క్యూర్-2026" బిల్లు.. చరిత్రలో నిలిచిపోతుంది.!

- బిల్లులోని అంశాలన్నీ పకడ్బందీగా అమలయ్యేలా చూడాలి... ఎమ్మెల్యే మల్‌రెడ్డి



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 12 మహా:** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌ను లండన్ , డల్లాస్ చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపించారని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ నగరం కోసం డెబ్బైఏళ్లలో ఎవరూ ఆలోచించని రీతిలో... ఎంతో దూరదృష్టితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యూర్ బిల్లు తెచ్చారని ఆయన చెప్పారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చలో భాగంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడారు.

**ఇప్పటికే పదిరెట్ల జనాభా పెరిగింది...**

డెబ్బై ఏళ్ల క్రితం హైదరాబాద్ నగరం కోసం చట్టం చేసిన నాటికి, ఇప్పటికే పదిరెట్ల జనాభా పెరిగిందని... తెలంగాణ జనాభాలో సగం మంది హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే నివాసం ఉంటున్నారని ఆయన చెప్పారు. మారిన పరిస్థితులకనుగుణంగా ప్రజలకు సమగ్ర పరిపాలన అందించే లక్ష్యంతో సీఎం రేవంత్ తెచ్చిన ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేస్తే... నగర చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. నగరం నలువైపులా విస్తరిస్తున్న తరుణంలో జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేయటం గొప్పనిర్ణయంగా మల్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ నాయకులు మాటలు చెప్పటానికే సరిపోయిందని... వారిలాగా కాకుండా తీసుకున్న ప్రతీనిర్ణయాన్ని పకడ్బందీగా అమలుచేయాల్సిన అవసరముందన్నారు.

**ప్రతీనెలా సమన్వయకమిటీ పర్యవేక్షించాలి....**

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రాలు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండదన్న మల్‌రెడ్డి... బిల్లులో పేర్కొన్నట్టుగా మూడ్నెళ్లకోసారి కాకుండా ప్రతీనెలా సమన్వయకమిటీ పర్యవేక్షిస్తే ఉత్తమమని సూచించారు. నిర్దేశించుకున్న సమన్వయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారయంత్రాంగాన్ని నడిపించాలని చెప్పారు. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ఈ బిల్లులోని అంశాన్నీ పూర్తిస్థాయిలో అమలైతే నగరవాసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉంటారని ఎమ్మెల్యే రంగారెడ్డి చెప్పారు.



# ప్రపంచం గర్వించదగిన మేధావి ఏచూరి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి, ప్రజా ఉద్యమాల నేత సీతారాం ఏచూరి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో శనివారం సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి, అమరజీవి సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా ఏచూరి చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, బండారు రవికుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిన ప్రతిసారీ ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించిన నాయకుడు ఏచూరి అని కొనియాడారు. కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. మార్క్సిజాన్ని అధ్యయనం చేయడమే కాకుండా దాన్ని ప్రజా జీవితంలో ఆచరణలో పెట్టిన దార్శనికుడని పేర్కొన్నారు. పార్లమెంటులోనూ, ప్రజా ఉద్యమాల్లోనూ ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. బండారు రవికుమార్ మాట్లాడుతూ లౌకిక విలువల పరిరక్షణకు ఏచూరి జీవితాంతం కృషి చేశారని తెలిపారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఆయన స్ఫూర్తితో లౌకిక శక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలతో పాటుగా ఓబీని తొలగించాలి

- **రోజుకి ఆఫ్ లోడింగ్ ద్వారా 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపే లక్ష్యం**
- **అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి దిశానిర్దేశం**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గును అందించాల్సి ఉన్నందున దీని కోసం సవరించిన ఓవర్ బర్డెన్ లక్ష్యాలను రోజువారీగా సాధించాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఆయన సింగరేణి వ్యాప్తంగా 15 ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తవ్వి తీసే పనులు నిర్వహిస్తున్న 19 ఆఫ్ లోడింగ్ సంస్థల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని దీనికి అనుగుణంగా సింగరేణి సంస్థ తన వంతుగా తగినంత బొగ్గును థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు అమలు జరుపుతోందని దీనికి అనుగుణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో సవరించిన ఓబీ తొలగింపు లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి ఆగస్టు నెల వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించే లక్ష్యాన్ని నిర్దేశించగా 101 శాతంతో 1,221 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించడం జరిగిందన్నారు. అయితే మొత్తం 19 ఆఫ్ లోడింగ్ సంస్థలలో ఆగస్టు నెలాఖరు వరకు 8 ఆఫ్ లోడింగ్ సంస్థల వారు మాత్రమే 100 శాతం ఓవర్ బర్డెన్ లక్ష్యాలు సాధించారని మిగిలిన వారు లక్ష్యాలు సాధిస్తూ సహకరించాలన్నారు. కాగా సెప్టెంబర్ నెలలో నిర్దేశిత రోజువారీ ఓబీ తొలగింపు లక్ష్యం 7.28 లక్షల క్యూబిక్ మీటర్లుగా భావించినప్పటికీ పెరుగుతున్న బొగ్గు డిమాండ్ కు అనుగుణంగా రోజువారీ లక్ష్యాన్ని 12.1 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్ణయించామని దీనికి అనుగుణంగా లక్ష్యాలు సాధించాలని కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాలు ఖచ్చితంగా సాధించాలని ఆదేశించారు. జె.వి.ఆర్ ఓ.సి, మణుగూరు ఓ.సి, జి.డి.కె ఓ.సి, ఆర్.జి ఓ.సి3, ఆర్.జి ఓ.సి2, కె.టి.కె ఓ.సి2, శ్రీరాంపూర్ ఓ.సీలలో ఓబీ తొలగిస్తున్న కొన్ని ఆఫ్ లోడింగ్ సంస్థల వారు లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నారనీ వెనుకబడిన లక్ష్యాల సాధనతో పాటు తాజాగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతీ ఆఫ్ లోడింగ్ సంస్థ ఎన్ని షవల్స్ ఎన్ని డంపర్లు వాడుతున్నాయి..? లక్ష్యాల సాధనకు ఎన్ని వాడాల్సి ఉంది..? అనే విషయాన్ని కూడా లోతుగా సమీక్షించారు. ఇంకా కొత్త ఓపెన్ కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ తొలగింపు ఆఫ్ లోడింగ్ టెండర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను సంస్థ సీఎండీ ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్)ఎల్.వి. సూర్య నారాయణ, డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్(ఈ అండ్ ఎం) ఎం.తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్)బి.వెంకన్న, జనరల్ మేనేజర్(కోఆర్డినేషన్ మార్కెటింగ్) ి.శ్రీనివాస్ అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు కార్పోరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# ఎలిగేడులో నూతన వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు

**పెద్దపల్లి మహా:** పెద్దపల్లి నియోజకవర్గంలో మరో నూతన వ్యవసాయ మార్కెట్ ఏర్పాటైంది. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలిగేడులో నూతన వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ జీఓ నంబర్ 570 ద్వారా నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.నూతన మార్కెట్ ఏర్పాటుతో ఎలిగేడు మండలంలోని రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించడంతో పాటు మార్కెటింగ్ పరంగా మరింత సౌకర్యం కలగనుంది.నూతన పాలకవర్గం ఎలిగేడు వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా పొట్యాల రమేష్, వైస్ చైర్మన్‌గా కోరుకంటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.డైరెక్టర్లుగా చంద్రగిరి పరశురాములు, కోరుకంటి సంపత్‌రావు, పొన్నాల స్వామి, అమ్ముల శ్రీనివాస్, పూరేళ్ల మల్లేశం, అప్పల హరీష్, గొడుగుల మహేందర్, కోడూరి రమేష్, ఏలేటి మల్లారెడ్డి, మెచినేని ఆంజనేయరావు నియమితులయ్యారు.నిబంధనల ప్రకారం స్థానిక సింగిల్ విండో చైర్మన్ (ఎలిగేడు), గ్రామ సర్పంచ్ (ఎలిగేడు), జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కూడా పాలకవర్గంలో డైరెక్టర్లుగా వ్యవహరించనున్నారు.నూతన వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావుకు మండల ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకానికి సహకరించి, రాష్ట్ర వ్యవసాయశాఖకు సిఫారసు చేసిన విజయరమణా రావుకు నూతన పాలకవర్గ సభ్యులు సైతం ధన్యవాదాలు తెలిపారు.




# పాలిటెక్నిక్ చదువుకు కొత్త సంకెళ్లు

**వరంగల్, బ్యూరో మహా:** జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తరగతులను బహిష్కరించి నిరసనలు చేపట్టారు. పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల డిప్లొమా విద్య భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జీవో 97లో ఏముంది?**

కొత్తగా ఏర్పాటు చేసిన స్కిల్, మానవ మూలధనం, జ్ఞాన శిక్షణ కార్యక్రమాల విభాగం పరిధిలో పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఫ్రేమ్‌వర్క్‌లోకి తీసుకురావడం జీవో ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. అయితే సాంకేతిక విద్యాశాఖ, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధిలో కొనసాగుతున్న డిప్లొమా కోర్సుల భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

**లేటరల్ ఎంట్రీపై ఆందోళన**

డిప్లొమా పూర్తిచేసిన తర్వాత టీజీ ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశించే లేటరల్ ఎంట్రీ అవకాశం కొనసాగుతుందా అనే సందేహం విద్యార్థుల్లో నెలకొంది. అలాగే డిప్లొమా కోర్సులకు ఎస్‌బీటీఈటీ, ఏఐసీటీఈ గుర్తింపుల విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు**

వరంగల్‌తో పాటు హైదరాబాద్, రామంతాపూర్, సికింద్రాబాద్, మహబూబాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో విద్యార్థులు ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసులు విద్యార్థులపై లాఠీచార్జి చేశారనే ఆరోపణలు వచ్చాయి. జీవోను రద్దు చేయకపోతే అసెంబ్లీ, సచివాలయాన్ని ముట్టడిస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి.

**ప్రభుత్వం వివరణ**

లేటరల్ ఎంట్రీ, ఫీజులు, స్కాలర్‌షిప్‌లలో ఎలాంటి మార్పులు ఉండవని, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. అయినప్పటికీ విద్యార్థులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. జీవో 97పై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చి, తమ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## పినపాకకు రూ.186 కోట్లతో
# రహదారుల మహర్దశ

- **హెచ్ఏఎం విధానంలో బీటీ రోడ్లు, వంతెనల అభివృద్ధి**
- **దసరాలోపే పనులకు శ్రీకారం**
- **15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యత సంబంధిత సంస్థలదే**
- **ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు**



**రూపురేఖలు మారనున్నాయి**

రూ.186 కోట్ల నిధులతో పినపాక నియోజకవర్గంలో రహదారులు, వంతెనల రూపురేఖలు మారనున్నాయి. ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే మా లక్ష్యం. దసరాలోపే పనులు ప్రారంభించి, నాణ్యతతో వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో రహదారులు, వంతెనల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గ పరిధిలో బీటీ రహదారులు, వంతెనలు, బ్రిడ్జిల నిర్మాణం, అభివృద్ధి పనులకు హెచ్ఏఎం విధానంలో సుమారు రూ.186 కోట్ల నిధులు మంజూరైనట్లు పినపాక ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతోపాటు అవసరమైన గ్రామీణ రహదారులు, వంతెనలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల మధ్య అనుసంధానం మెరుగుపడి, ప్రజలకు సురక్షితమైన, మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

**దసరాలోపే పనులు ప్రారంభం..**

మంజూరైన పనులను దసరా పండుగలోపే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పాయం ఈ సందర్భంగా తెలిపారు. హెచ్ఏఎం విధానంలో చేపట్టే ఈ పనుల నిర్వహణ బాధ్యత సుమారు 15 సంవత్సరాలపాటు సంబంధిత సంస్థలకే ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దీంతో రహదారులు నిర్మించడమే కాకుండా వాటి దీర్ఘకాలిక నిర్వహణకు కూడా భరోసా ఉంటుందని పేర్కొన్నారు.

**మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు..**

నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు కావడానికి సహకరించిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఎమ్మెల్యే కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రహదారులు, వంతెనల నిర్మాణానికి రూ.186 కోట్ల మేర నిధులు సమకూర్చేందుకు కృషి చేసినందుకు ఆయనకు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సహకరించడం వల్ల నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారులు, వంతెనల సమస్యలకు పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# డిజిటల్ సర్వే లో భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **డిజిటల్ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్**

**కిలా,వరంగల్ మహా ;** ఖిలా వరంగల్‌లోని స్తంభంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా డిజిటల్ సర్వేలో భాగంగా చేపడుతున్న భూముల వివరాల నమోదు, మ్యాప్‌లోని వివరాలకు, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేకు మధ్య ఉన్న వ్యత్యాసాలను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియలో వినియోగిస్తున్న సాంకేతికత, భూముల హద్దులు, వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.డిజిటల్ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తూ, భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మ్యాప్ వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లయితే వాటిని నిశితంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను సమన్వయంతో, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో వరంగల్ ఆర్డీవో సుమ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, స్తంభంపల్లి గ్రామ రైతులు తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# సాంకేతిక వృద్ధి సామాజిక ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలి..

- **చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్.వీ.పురుషోత్తం రెడ్డి**

**మొయినాబాద్ మహా:** సాంకేతిక వృద్ధి సామాజిక ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలని, చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్.వీ.పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో "ఎపిడెమియాలాజికల్ స్టడీస్ అండ్ అసెస్మెంట్ అఫ్ అడ్వెర్స్ డ్రగ్ రియాక్షన్స్ ఇన్ అడల్ట్స్ అండ్ గెరియాట్రిక్ పేషంట్స్" అనే అంశంపై పరిశోధన సిద్ధాంతానికి మెహ్రూక్ ఫాతిమాకు పీహెచ్.డీ. డిగ్రీ పట్టా లభించగా.. యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్.వీ.పురుషోత్తం రెడ్డి ఆయన చేతుల మీదుగా పీహెచ్.డీ డిగ్రీ పట్టాను ప్రధానం చేశారు. ఈ పరిశోధన డాక్టర్ కే. డేనియల్ పర్యవేక్షణలో పూర్తి చేసి ఆమె ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్.వీ. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసీ రంగంలో పరిశోధనలు జాతీయ అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. పెద్దలు,వృద్ధుల రోగులలో ఔషధ దుష్ప్రభావాల యొక్క వ్యాధిశాస్త్ర అధ్యయనాలు అంచనా చేయడం అభినందనీయమన్నారు. అలాగే చైతన్య యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో సమాజానికి అవసరమైన సృజనాత్మకమైన పరిశోధనలను ప్రోత్సహిస్తూ.. ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీ.శంకర్ లింగం, రిజిస్టర్ యం.రవీందర్, క్రిస్టోఫర్, ఏ.రాజు, జీ. కుమార స్వామి, బి.రాజేందర్ రెడ్డి, ఈ.జగదీష్ కుమార్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ పరిధిలోని పత్తికుంట చెరువు వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,ఏసీపీ శ్రీనివాస్, గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనం సాఫీగా జరిగేలా చెరువు వద్ద విద్యుత్ దీపాలు (లైటింగ్), బారికేడ్ల ఏర్పాట్లను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బల్దియా, పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. పారిశుధ్య పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.భారీ సంఖ్యలో విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన భద్రతా చర్యలు, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ శాఖల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.





# అరిస్టాటిల్ పీజీ కళాశాలలో ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమం విజయవంతం..

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అరిస్టాటిల్ పీజీ కళాశాల స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్లో భాగంగా ఎంబీఏ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం టాస్క్, నంది ఫౌండేషన్, మహీంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్ వారి సహకారంతో ఆరు రోజులపాటు ఉపాధి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆరు రోజులపాటు కొనసాగిన ఈ శిక్షణ కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఆటిట్యూడ్ లాజికల్ రీజనింగ్, సమస్య పరిష్కారం నైపుణ్యాలు, ప్రొఫెషనల్ స్కిల్స్, ఉద్యోగానికి అవసరమైన వివిధ సమర్థాలపై ప్రాక్టికల్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎల్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఉద్యోగ సిద్ధత, కమ్యూనికేషన్, సామర్థ్యం, ఇంటర్వ్యూలను సామర్థవంతంగా ఎదుర్కొనే నైపుణ్యాలు గణనీయంగా పెరిగాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సామర్థవంతంగా నిర్వహించడంలో కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్వేత కీలకపాత్ర పోషించారని, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ట్రైనర్ పి.సాగర్ బాబుకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉద్యోగాలను మెరుగుపరిచే విధంగా విలువైన శిక్షణ అందించిన టాస్క్, నంది ఫౌండేషన్, మహీంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు సాధించేందుకు మరింత సహకారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# లంచం కేసులో తహశీల్దార్‌కు రెండేళ్ల జైలు శిక్ష

**బెల్లంపల్లి ,మహా:** లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ కి చిక్కిన తహశీల్దార్ నకు కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. కరీంనగర్ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సంతోష్‌కుమార్ ఈ మేరకు తీర్పు వెల్లడించారు.మంచిర్యాల జిల్లా కాసిపేట మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన అలుగునూరి రోషయ్య 2013 జనవరి 9న లంచం తీసుకుంటూ దొరికాడు. ఓ వ్యక్తి భూమి మ్యుటేషన్, పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయడం కోసం రూ.10 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 13 ఏళ్ల తర్వాత తాజాగా ఆ కేసులో నిందితుడైన తహశీల్దార్ రోషయ్యకు కోర్టు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.సాక్ష్యాధారాలను విచారించిన కోర్టు తహశీల్దార్ అలుగునూరి రోషయ్యను దోషిగా నిర్ధారించారు. రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా చెల్లించాలని శిక్ష విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించింది.



# నాని యాక్షన్‌కు హద్దుల్లేవట!

న్యాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. 'దసరా' తర్వాత ఈ జోడీ కలిసి చేస్తున్న సినిమా కావడంతో ప్రారంభం నుంచే ఆసక్తి నెలకొంది. తాజాగా ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్ ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'ది ప్యారడైజ్'లో యాక్షన్ సన్నివేశాలు చాలా తీవ్రంగా ఉంటాయని వారు తెలిపారు. 'దసరా'తో పోలిస్తే ఇందులో మరింత భారీ స్థాయిలో యాక్షన్ ఉంటుందని చెప్పారు. టీజర్‌లో కనిపించిన హింసాత్మక సన్నివేశాలు సినిమాకు సంబంధించిన పూర్తి తీవ్రతలో చిన్న భాగమేనని పేర్కొన్నారు. ఈ సినిమాలో సాధారణంగా మధ్య మధ్యలో ఫైట్స్ రావడం కాకుండా, యాక్షన్ చుట్టూనే కథనం ముందుకు సాగేలా సన్నివేశాలను రూపొందించినట్లు వివరించారు. రెండు కీలక యాక్షన్ బ్లాక్స్‌ను రూపొందించడానికి సుమారు 20 రోజుల సమయం పట్టిందని రామ్‌లక్ష్మణ్ చెప్పారు. యాక్షన్ విభాగంలో రియల్ సతీష్, నవకాంత్ కూడా పనిచేసినట్లు వెల్లడించారు. ఈ సినిమాలో నాని లుక్, బాడీ లాంగ్వేజ్‌ను ఇంతకుముందు చూడని విధంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కొరియన్ యాక్షన్ సినిమాల ప్రభావంతో ఆయన పాత్రను డిజైన్ చేసినట్లు వివరించారు. రెండు జడలతో, బేర్‌బాడీతో పోరాడే పాత్ర కావడంతో కొన్ని యాక్షన్ సన్నివేశాలు నానికి సవాల్‌గా మారాయని చెప్పారు. షర్ట్ లేకుండా యాక్షన్ చేయాల్సి రావడంతో రోప్ సపోర్ట్ ఉపయోగించడం కూడా సాధ్యం కాలేదని తెలిపారు. అందుకే సహజమైన ఇంపాక్ట్ కోసం నాని స్వయంగా పలు యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆ పాత్ర ఎదుర్కొనే శారీరక ఇబ్బందులను అర్థం చేసుకునేందుకు ముందుగా అసిస్టెంట్లపై కూడా కొన్ని ప్రయోగాలు చేసినట్లు చెప్పారు. పాత్ర కోసం నాని ఎంతో కష్టపడ్డారని రామ్‌లక్ష్మణ్ ప్రశంసించారు. షూటింగ్ సమయంలో కఠినమైన డైట్‌తో పాటు వర్కౌట్స్ చేస్తూ బాడీని మెయింటైన్ చేశారని తెలిపారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పట్టుదల, రాజీపడని విధానం తనకు ప్రత్యేకంగా అనిపించిందని, నాని అంకితభావం తెరపై కొత్త తరహా యాక్షన్ అనుభూతిని అందిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# 'మనం' సినిమాను ఇప్పటికీ చూడలేకపోతున్న సుమంత్



సినిమా చాలామందికి వినోదం అయితే, మరికొందరికి జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకం. అయితే అక్కినేని సుమంత్‌కు 'మనం' చిత్రం మాత్రం ఒక ప్రత్యేకమైన భావోద్వేగంతో ముడిపడి ఉంది. అక్కినేని కుటుంబంలోని మూడు తరాలైన ఏఎన్నార్, నాగార్జున, నాగచైతన్య ఒకే సినిమాలో కనిపించడం, ఏఎన్నార్ చివరి చిత్రంగా నిలవడం 'మనం'కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. అయితే ఈ సినిమాను ప్రేక్షకుడిగా ఆస్వాదించడం సుమంత్‌కు అంత సులభం కాలేదు. ఇటీవల ఓ సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 'మనం' సినిమాను పూర్తిగా చూడలేకపోయానని వెల్లడించారు. సినిమాలోని సన్నివేశాలను చూస్తున్నప్పుడు కథ కంటే తన తాత అక్కినేని నాగేశ్వరరావుతో ముడిపడిన జ్ఞాపకాలే ఎక్కువగా గుర్తుకొస్తాయని తెలిపారు. ఏఎన్నార్ జీవితంలోని చివరి దశను దగ్గరగా చూసిన కుటుంబ సభ్యుల్లో సుమంత్ కూడా ఉన్నారు. అందుకే 'మనం'లో ఆయనను తెరపై చూసిన ప్రతిసారీ గత జ్ఞాపకాలు తిరిగి గుర్తుకొస్తాయని సుమంత్ చెప్పిన మాటలు భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. అభిమానులకు 'మనం'లో ఏఎన్నార్‌ను చివరిసారిగా చూడటం ఆనందంతో పాటు భావోద్వేగాన్ని కలిగిస్తుంది. కానీ ఆయన చివరి రోజులను దగ్గరగా చూసిన మనవడికి మాత్రం అదే సినిమా వ్యక్తిగతమైన బాధను గుర్తుచేస్తోంది. మనకు ఎంతో ప్రియమైన వ్యక్తులతో ముడిపడిన జ్ఞాపకాలను మళ్లీ ఎదుర్కోవడం ఎంత కష్టమో సుమంత్ అనుభవం తెలియజేస్తోంది. కొన్ని సినిమాలను ఎప్పుడైనా చూడొచ్చు. కానీ కొన్ని జ్ఞాపకాలను మళ్లీ గుర్తుచేసుకునేందుకు మనసు సిద్ధంగా ఉండదు. సుమంత్‌కు 'మనం' సినిమా కూడా అలాంటి ప్రత్యేకమైన, భావోద్వేగంతో కూడిన జ్ఞాపకంగానే మిగిలిపోయింది.

# కవ్వించే అందంతో కావ్య థాపర్



బోల్డ్ గ్రీన్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందించిన ఈ స్టూడియో ఫొటోషూట్‌లో కావ్య థాపర్ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. లేత పసుపు రంగు చీరలో పెద్ద పూల డిజైన్లు ఆమె లుక్‌కు ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చాయి. గులాబీ, ఆకుపచ్చ రంగుల్లోని పూల మోటిఫ్స్‌తో చీర సంప్రదాయ, ఫెస్టివ్ లుక్‌ను అందిస్తోంది. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌పై క్రిస్టల్స్, బీడ్స్‌తో చేసిన అలంకరణ మరింత మెరుపును జోడించింది. అందమైన డ్యాంగ్లర్స్, గోల్డ్ బ్యాంగిల్స్, మెరిసే ఉంగరంతో కావ్య లుక్ పూర్తి చేశారు. చిరునవ్వుతో పాటు చక్కగా ముడివేసిన హెయిర్‌స్టైల్ ఆమె అందాన్ని మరింత పెంచింది. ముంబైలో జన్మించిన కావ్య థాపర్ 2018లో విడుదలైన తెలుగు చిత్రం 'ఈ మాయ పేరేమిటో'తో నటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం 2019లో 'మార్కెట్ రాజా ఎంబీబీఎస్'తో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 2022లో 'మిడిల్ క్లాస్ లవ్' చిత్రంతో హిందీలోకి ఎంట్రీ ఇచ్చారు. 'ఏక్ మినీ కథ' (2021), 'పిచైక్కారన్ 2' (2023) సినిమాలతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. 2024లో కావ్య పలు సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. రవితేజతో కలిసి నటించిన 'ఈగల్' ఆమె కెరీర్‌లో ప్రత్యేక చిత్రంగా నిలిచింది. దీంతో పాటు 'డబుల్ ఇస్మార్ట్', 'ఊరు పేరు భైరవకోన', 'విశ్వం' చిత్రాల్లోనూ కనిపించారు. సినిమాలతో పాటు 'ఫర్జీ', 'క్యాట్' వంటి వెబ్ సిరీస్‌లలోనూ నటించారు. ప్రస్తుతం 'నేను రెడీ' అనే తెలుగు చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగు, తమిళ, హిందీ చిత్రాల్లో తన ప్రతిభను చాటుకుంటూ కావ్య థాపర్ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు.



# అక్క మాట నమ్మి ఏడ్చిన అలియా

బాలీవుడ్ లో ఆలియా భట్ కెరీర్ దేదీప్య మానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. ఓ వైపు సినిమాలు చేస్తూనే మరో వైపు కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. అయితే కథల విషయంలో మాత్రం తొందరపడటం లేదు. సరైన కథలు వస్తే తప్ప కమిట్ అవ్వడం లేదు. పారితోషికం భారీగా ఆపర్ చేస్తున్నా? నచ్చిన కథలకే కమిట్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా డోంట్ బీ షై ఈవెంట్ లో అలియాభట్ అక్క షాహిన్ బట్ తో ఉన్న చిన్న నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఓ కార్యక్రమంలో భాగంగా రేజ్‌బెయిట్ (ఇతరులను కావాలని కోపం తెప్పించడం లేదా చిరాకు పెట్టడం) అనే అంశంపై మాట్లాడాల్సిందిగా ఆలియాను కోరారు. దానికి అలియా భట్క ఇలా స్పందించారు. చిన్నతనంలో తన సోదరి షాహీన్ తనను నిరంతరం కోపానికి గురిచేసేదని తెలిపారు. తనకు నాలుగేళ్ల వయస్సు ఉన్నప్పుడు నువ్వు అమ్మానాన్నల (మహేష్ భట్, సోని రజ్దాన్) సొంత బిడ్డవి కావు.. పార్లేజి బిస్కట్ ప్యాకెట్‌తో ఫ్రీగా వచ్చావు అని చెప్పి ఏడిపించేదని ఆలియా భట్ నవ్వుతూ వెల్లడించారు. చిన్నప్పుడు షాహీన్ చేసిన ఈ సరదా వ్యాఖ్యలు తనను తీవ్రంగా కోపానికి గురిచేసేవని, ఆ వయసులో అదే నిజమని నమ్మి ఏడ్చేదాన్ని అన్నారు. అక్కచెల్లెళ్ల మధ్య ఉండే చిన్ననాటి చిలిపి గొడవలు, ఆటపట్టించడాలు తమ మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసాయన్నారు. ఇదే వేదికపై ఆలియా భట్ తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యారు. 2012లో కరణ్ జోహార్ దర్శకత్వంలో తెరకెక్కిన స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ చిత్రం ద్వారా అలియభట్ కథానాయికగా పరిచయమైన సంగతి తెలిసిందే. సరిగ్గా 14 ఏళ్ల క్రితం నటిగా ఇండస్ట్రీలోకి వచ్చిన అలియా ఇప్పుడు ఒక నిర్మాతగా తన ప్రాజెక్ట్ ద్వారా నలుగురు కొత్త నటీనటులను పరిచయం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. నిర్మాతగా వైవిధ్యమైన కంటెంట్‌ను అందిస్తూనే నూతన ప్రతిభను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ఆలియా పేర్కొన్నారు. ఆలియా భట్ నిర్మించిన డోంట్ బీ షైసిరీస్ విషయానికొస్తే ఇందులో ఆరుషి బజాజ్, పీయూష్ ఖాటి, బియాంకా అరోరా అంశ్ దుగ్గల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రేమ, చిన్ననాటి పొరపాట్లు, యువత ఆలోచనల చుట్టూ సాగే కమింగ్‌ఆఫ్‌ఏజ్ సిరీస్ సెప్టెంబర్ 25 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఇక ఆలియా భట్ కెరీర్ విషయానికొస్తే ప్రస్తుతం సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న లవ్ & వార్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమెతో పాటు రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దీంతో పాటు తుంబాడ్ 2` చిత్రంలోనూ అమ్మడు కీలక పాత్ర పోషిస్తున్నారు.

# సూర్య–శివకార్తికేయన్ మధ్య సైలెంట్ వార్?

తమిళ సినీ పరిశ్రమలో సూర్య, శివకార్తికేయన్ మధ్య మరోసారి సోషల్ మీడియా చర్చ మొదలైంది. సాధారణంగా వివాదాలకు దూరంగా ఉండే సూర్యను శివకార్తికేయన్ తన తాజా పోస్టుతో టార్గెట్ చేశారంటూ కొందరు అభిమానులు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యల వెనుక గతంలో జరిగిన ఓ ఘటనను నెటిజన్లు ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. ఇటీవల కార్తి నటించిన 'సర్దార్ 2', సూరి ప్రధాన పాత్రలో వచ్చిన 'మండాడి' సినిమాలు విడుదలయ్యాయి. 'సర్దార్ 2' చిత్రబృందానికి, కార్తికి శుభాకాంక్షలు తెలిపిన శివకార్తికేయన్.. మరోవైపు 'మండాడి'కి మంచి స్పందన వస్తోందంటూ సూరి కష్టాన్ని ప్రశంసించారు. మంచి కంటెంట్‌కు ఎప్పుడూ విజయం దక్కుతుందనే అర్థంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సూర్య అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. దీనికి కారణం నాలుగేళ్ల క్రితం జరిగిన మరో సోషల్ మీడియా పోస్టేనని అభిమానులు చెబుతు...

ర్తికేయన్ 'ప్రిన్స్' సినిమాలు ఒకే సమయంలో విడుదలయ్యాయి. అప్పట్లో 'ప్రిన్స్' చిత్రబృందానికి శుభాకాంక్షలు చెబుతూనే సూర్య 'సర్దార్' సినిమాను ఉద్దేశించి మంచి కంటెంట్ ఎప్పుడూ గెలుస్తుందనే వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత 'ప్రిన్స్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోగా, 'సర్దార్' మంచి ఆదరణ పొందింది. అప్పట్లో శివకార్తికేయన్ దీనిపై ఎలాంటి స్పందన చేయలేదు. ఇప్పుడు 'సర్దార్ 2'కు ప్రతికూల టాక్ వచ్చిన సమయంలో ఆయన చేసిన తాజా పోస్టును కొందరు అభిమానులు పాత ఘటనకు సమాధానంగా భావిస్తున్నారు. అయితే శివకార్తికేయన్ ఉద్దేశపూర్వకంగానే సూర్యను టార్గెట్ చేశారా లేదా అనేది స్పష్టంగా తెలియదు. సోషల్ మీడియాలో మాత్రం ఇద్దరు హీరోల అభిమానుల మధ్య చర్చ, ట్రోలింగ్ మొదలైంది. ఈ వ్యవహారం ఇక్కడితో ముగుస్తుందా.. లేక మరింత ముదురుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com